మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 31-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00

సంపుటి: 1 Volume:1 || సంచిక: 332 Issue: 332

Circulated to Telangana
Published from Jagitial


31 మే 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:44 సూర్యాస్తమయం - సా. 6:42
తిథి పౌర్ణమి మ. 2:15 వరకు తరువాత పాడ్యమి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం అనురాధ సా. 4:05 వరకు తరువాత జ్యేష్ఠ యోగం సిద్ధ ఉ. 6:11o వరకు కరణం బవ మ. 2:15 వరకు
భాలవ తె. 3:25o వరకు వర్జ్యం రా. 10:28 నుండి రా. 12:16 వరకు దుర్ముహూర్తం సా. 4:58 నుండి సా. 5:50 వరకు రాహుకాలం సా. 5:05 నుండి సా. 6:42 వరకు
యమగండం మ. 12:13 నుండి మ. 1:51 వరకు గుళికాకాలం మ. 3:28 నుండి సా. 5:05 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:08 నుండి తె. 4:56 వరకు అమృత ఘడియలు
తె. 4:33 నుండి ఉ. 6:20 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:39 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



## బంగారం దుకాణ్ల వెలవెల

### భారత్‌లో భారీగా తగ్గిన డిమాండ్
### పసిడిపై పన్ను భారం భారీగా పెంపు
### తేలికపాటి నగల వైపు కస్టమర్ల మొగ్గు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఒక్క నిర్ణయం దేశంలో పసిడి అమ్మకాలను భారీగా తగ్గించేసింది. దిగుమతి సుంకాన్ని భారీగా పెంచడంతో విక్రయాలు పడిపోయాయి. ఇరాన్ ఉద్రిక్తతలతో పెరిగిన ఇంధన, - 2 వ పేజీలో...



## గోల్డ్ బాండ్లతో పైసల గలగల

### ఒక లక్షకు 3.27 లక్షలు.. 227%శాతం లాభం
### ఐదేళ్ల క్రితం సావరిన్ గోల్డ్ బాండ్ల జారీ
### రేపటి నుంచి విత్‌డ్రా చేసుకునే అవకాశం

న్యూఢిల్లీ: సావరిన్ గోల్డ్ బాండ్ (ఎస్‌జీబీ) పథకంలో పెట్టుబడి పెట్టిన వారికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) శుభవార్త అందించింది. ఐదేళ్ల క్రితం జారీ చేసిన ఎస్‌జీబీ 2021-22 సిరీస్-2 తరువాయి 2 వ పేజీలో...

## ఇంతి పోరు.. ఇక బతకలేను!

### భార్య వేధిస్తోందని భర్త ఆవేదన
### కారుణ్య మరణం కోసం దరఖాస్తు
### గుజరాత్‌లోని సూరత్‌లో ఘటన



గుజరాత్‌లోని సూరత్‌లో ఒక వింత ఘటన వెలుగుచూసింది. తన భార్య వేధింపులు తాళలేకపోతున్నానని, కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ కిరిట్ పటేల్ అనే వ్యక్తి జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించడం సంచలనం సృష్టిస్తోంది.

సూరత్: భార్యతో న్యాయపరమైన వివాదాలు, మానసిక వేదనతో విసిగిపోయానని, తనకు మరణమే శరణ్యమని ఆయన తన దరఖాస్తులో పేర్కొన్నాడు.తన భార్య ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టిస్తోందని, మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలను దుర్వినియోగం చేస్తూ తనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తోందని కిరిట్ పటేల్ ఆరోపించాడు. తనకు, తన భార్యకు ఇది మూడో వివాహమని ఆయన తెలిపారు. తన భార్యను 'దోపిడీ చేసే పెళ్లికూతురు'గా అభివర్ణించాడు. ఆమె డబ్బు కోసం చట్టపరమైన కేసులతో పెళ్లి చేసుకుని వేధిస్తుందని ఆరోపించాడు. ఇంతకుముం దు పెళ్లి చేసుకుని వదిలేసిన వారిని కూడా ఇలాగే వేధించిందని పేర్కొన్నాడు. వారి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు చెప్పాడు. ఆమె వేధింపులపై వారు పోలీసులను ఆశ్రయించారని చెప్పాడు. తనకు 2024తో ఆమెతో వివాహం జరిగిందని, నాటి నుంచి తన భార్య, అత్త డబ్బు కోసం వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించాడు. తన సమస్యను నిర్దిష్ట గడువులోగా తీర్చాలని కలెక్టర్‌ను తరువాయి 2 వ పేజీలో...



## పతంజలి.. ఎంత మోసం!


### తప్పుడు ప్రకటనలతో ఉత్పత్తుల అమ్మకం
### మహారాష్ట్రలో ఆ కంపెనీ మందులు సీజ్.. రాష్ట్రవ్యాప్తంగా ఎఫ్‌డీఏ కొరడా

ప్రముఖ యోగా గురు బాబా రాందేవ్‌కు చెందిన పతంజలి బ్రాండ్ ఉత్పత్తులకు మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) షాక్ ఇచ్చింది. నివారణ అంటూ తప్పుదోవ పట్టించే, అభ్యంతరకరమైన ప్రకటనలు ఇస్తున్నారన్న ఆరోపణలతో ఎఫ్‌డీఏ రాష్ట్రవ్యాప్తంగా దాడులు నిర్వహించి భారీగా మందులను స్వాధీనం చేసుకుంది.

ముంబై: సీజ్ చేసిన ఆయుర్వేద, అల్లోపతి మందుల విలువ సుమారు రూ. 73.24 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఈ మందుల్లో పతంజలి బ్రాండ్‌తో విక్రయిస్తున్న ఉత్పత్తులు కూడా ఉన్నాయి. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ -2 వ పేజీలో...

## ఎల్‌నినో.. ఎంత పని జేస్తివి!

### ఈసారి రుతుపవనాలకు దెబ్బ .. ఐఎండీ తాజా నివేదికలో వెల్లడి
### దేశంలో సాధారణం కన్నా తక్కువ వానలు



దేశంలో 2026 నైరుతి రుతుపవనాలపై భారత వాతావరణ శాఖ (ఐఎండీ) కీలక అంచనాలను విడుదల చేసింది. ఈ ఏడాది కేరళ సహా దేశంలోని చాలా ప్రాంతాల్లో 'సాధారణం కంటే తక్కువ' వర్షపాతం నమోదవుతుందని శనివారం వెల్లడించింది. దీనికి ఎల్ నినో ప్రభావమే ప్రధాన కారణమని, ఇది దాని విచిత్రమైన లక్షణమని ఐఎండీ డైరెక్టర్ నీతా కే గోపాల్ తెలిపారు.


న్యూఢిల్లీ: ఆమె మాట్లాడుతూ, "వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈసారి రుతుపవనాల తీరు ఆశాజనకంగా లేదు. కేరళతో పాటు దేశంలోని చాలా ప్రాంతాల్లో వర్షపాతం సాధారణం కన్నా తక్కువగా ఉంటుంది" అని వివరించారు. ముఖ్యంగా కేరళలో జూన్ నెలలోనూ వర్షపాతం తక్కువగానే ఉంటుందని ఆమె పేర్కొన్నారు. 'రుతుపవనాల ఆగమనం తర్వాత, జూన్ 10 ప్రాంతంలో కొన్ని మంచి వర్షాలు పడవచ్చు. కానీ తరువాయి 2 వ పేజీలో...




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,704 |
| వెండి (కిలో): | రూ.2,90,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,851 |

## విశ్వవాణి



1982లో డల్లాస్‌లో స్టీవెన్ ఫిలిప్స్‌ను లైంగిక దాడి, దొంగతనం కేసుల్లో అరెస్టు చేసి దోషిగా తేల్చారు. అయితే తరువాత ఆ నేరాలను మరో వ్యక్తి చేసినట్లు తేలింది. అయినప్పటికీ ఫిలిప్స్ 24 సంవత్సరాలు జైలులో గడపాల్సి వచ్చింది. దీంతో అక్కడి చట్టం ప్రకారం ఆయనకు 6 మిలియన్ డాలర్లు పరిహారం లభించింది. ఆ పరిహారం కోసం తన మాజీ భార్య కోర్టుకెక్కింది. అందులో తనకూ వాటా ఉందని వాదించింది. అయితే, ఫిలిప్స్‌కు అందిన పరిహారం పూర్తిగా ఆయన అన్యాయంగా జైలులో గడిపిన కాలం, వ్యక్తిగత బాధలు, స్వేచ్ఛ కోల్పోవడం వంటి అంశాలకు సంబంధించినదేనని, అది దాంపత్య ఆస్తిగా పరిగణించలేమని స్పష్టం చేసింది. ఆ డబ్బుపై మాజీ భార్యకు ఎలాంటి హక్కు లేదని తేల్చింది.

## కడుపు కోతలు!

### రాష్ట్రంలో ప్రతి 10 డెలివరీల్లో 6 సిజేరియన్లే
### నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వేలో వెలుగులోకి
### ప్రభుత్వ ఆస్పత్రులలోనూ భారీగా ఆపరేషన్లు



ఓ గర్భిణి ఆస్పత్రికి వస్తే చాలు.. నార్మల్ డెలివరీ అవడం ప్రపంచ వింత అన్నట్లుగా మారిపోయింది పరిస్థితి. పరిస్థితులు అలా మారుతున్నాయో, లేదా డాక్టర్ల అత్యాశ కారణమో తెలియదు కానీ.. ప్రసవాల్లో సిజేరియన్ల సంఖ్య పెరుగుతోంది. మరీ ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ఈ సంఖ్య ఎక్కువగా ఉందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

హైదరాబాద్, మే 30 (ఈవార్తలు): జాతీయ ఆరోగ్య శాఖ నేషనల్ హెల్త్ సర్వే గణాంకాల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి పది డెలివరీలలో ఆరు సిజేరియన్లే ఉన్నాయనే చేదు నిజం ఆందోళన రేకెత్తిస్తోంది. జాతీయ సగటుతో పోలిస్తే తెలంగాణలో ఎక్కువగా ఉండటం మరింత కలవర పెడుతోంది. దేశంలోనే తెలంగాణలో ఎక్కువగా సిజేరియన్లు జరుగుతున్నట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ విడుదల చేసిన నేషనల్ హెల్త్ సర్వే ఫలితాల్లో వెల్లడైంది. ఆరోగ్య రంగానికి సంబంధించి అనేక రంగాలలో తెలంగాణలో ముందున్నప్పటికీ ఈ సీ సెక్షన్ల విషయంలో మాత్రం లెక్కలు తరువాయి 2 వ పేజీలో...




## పచ్చ కారట.. ట్రంప్ ఊరట

### గ్రీన్ కార్డ్ నిబంధనలపై అమెరికా యూటర్న్
### భారతీయులకు భారీ ఉపశమనం
### దరఖాస్తు సమయంలో యూఎస్‌లోనే ఉండొచ్చని క్లారిటీ

అమెరికాలో వలసదారులకు శాశ్వత నివాసం హోదా కల్పించే గ్రీన్ కార్డు నిబంధనల విషయంలో డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం వెనక్కి తగ్గింది. గ్రీన్ కార్డు దరఖాస్తు ప్రక్రియను వలసదారులు తమ స్వదేశంలో చేసుకోవాల్సి ఉంటుందని ఇటీవల అమెరికా చేసిన ప్రకటన గందరగోళానికి దారితీసిన విషయం తెలిసిందే. అయితే, పాత విధానం ప్రకారం అమెరికాను విడిచి వెళ్లాల్సిన అవసరం లేదని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ ప్రకటించినట్టు ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలను వెలువరించింది.

వాషింగ్టన్: ఇదేమీ విస్తృతస్థాయి విధాన మార్పులు కాదని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం వివరణ ఇచ్చింది. గ్రీన్‌కార్డు దరఖాస్తుదారుడు అమెరికాలో ఉండి పూర్తిచేయాలా? స్వదేశానికి వెళ్లాలా? అనేది ఇమిగ్రేషన్ అధికారి నిర్ణయిస్తారని పేర్కొంది. ఈ నిబంధన చాలాకాలం నుంచి అమల్లో ఉందని తెలిపింది. మే 21న ఇచ్చిన మార్గదర్శకాల ఉద్దేశం ఇమిగ్రేషన్ అధికారులకు ఆ విచక్షణాధికారాన్ని గుర్తుచేయడం తప్పా కొత్తదేమీ కాదని డీహెచ్‌ఎస్ ప్రతినిధి పేర్కొన్నారు. గ్రీన్ కార్డు కోసం వలసదారుల దరఖాస్తుల -2 వ పేజీలో...

## మేం రైతు 'బంధు'లం

### నాణ్యమైన విద్యుత్తు కోసమే రైతు డిస్కం
### మీటర్లు పెట్టకపోతే పోటీ నుంచి తప్పుకుంటరా?
### బీఆర్‌ఎస్‌కు సీఎం రేవంత్ సవాల్



తెలంగాణలో వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టేందుకే 'రైతు డిస్కం' ఏర్పాటు చేస్తున్నారంటూ ప్రతిపక్ష బీఆర్‌ఎస్ చేస్తున్న ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈ ఆరోపణలను ఖండిస్తూ, బీఆర్‌ఎస్‌కు సంచలన సవాల్ విసిరారు.

హైదరాబాద్, మే 30 (ఈవార్తలు):తమ ప్రభుత్వం మోటార్లకు మీటర్లు బిగించినా, ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేసినా రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేయబోదని ఆయన స్పష్టం చేశారు. అదే సమయంలో, తరువాయి 2 వ పేజీలో...



## అందుకే 'బంద్' పెట్టిండ్రు

### 4 సార్లు పెట్టుబడి సాయం ఎగ్గొట్టిన రేవంత్ సర్కారు
### ముషీరాబాద్ బీఆర్‌ఎస్ మెంబర్‌షిప్ డ్రైవ్‌లో కేటీఆర్
### గ్రామాల్లో జనాలు కాంగ్రెస్‌ను తిడుతున్నారని వ్యాఖ్య

హైదరాబాద్, మే 30 (ఈవార్తలు): తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ సెగలు మరింత రాజుకున్నాయి. ముషీరాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ మెంబర్‌షిప్ డ్రైవ్‌లో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని, కాంగ్రెస్ ప్రభుత్వంపై తనదైన శైలిలో తరువాయి 2 వ పేజీలో...



## 3న డీకే ప్రమాణం

### సీఎల్పీ నేతగా ఏకగ్రీవ ఎన్నిక

బెంగళూరు: డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు ముహూర్తం ఖరారైంది. జూన్ 3వ తేదీ సాయంత్రం 5:15 గంటలకు ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టనున్నారు. వాస్తు తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

31.5.2026

మేషం: ఆర్థిక అనుకూలత కలుగుతుంది. ప్రముఖులతో పరిచయాలు విస్తృతమౌతాయి. కుటుంబ వ్యవహారాలలో సన్నిహితుల సహాయ సహకారాలు అందుతాయి. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగాలలో సమస్యలు తొలగుతాయి.

వృషభం: స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. దూర ప్రయాణ సూచనలున్నవి. ఇంటాబయటా కొంత వ్యతిరేక పరిస్థితులుంటాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. చేపట్టిన పనులు శ్రమతో పూర్తవుతాయి. ఉద్యోగాలలో అధికారుల అండదండలు పొందుతారు.

మిధునం: ఆకస్మిక ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. బంధువులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఇంటా బయట పరిస్థితులు అనుకూలించవు. ఉద్యోగయత్నాలు మందగిస్తాయి. వ్యాపారాలలో శత్రు సమస్యలు ఉంటాయి. ఉద్యోగాలలో స్థానచలన సూచనలున్నవి.

కర్కాటకం: కుటుంబ పరిస్థితులు చికాకు పరుస్తాయి. పని ఒత్తిడి పెరిగి సమయానికి నిద్రహారాలు ఉండవు. సన్నిహితులతో మాటపట్టింపులుంటాయి. ఆర్థిక వ్యవహారాలు నిరాశ పరుస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభించకపోవడం మంచిది. ఉద్యోగమున కొంత అనుకూల వాతావరణం ఉంటుంది.

సింహం: విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. స్థిరాస్తి వివాదాలు ఒక కొలిక్కి వస్తాయి. చేపట్టిన పనులు సజావుగా సాగుతాయి. ఆప్తుల నుంచి కీలక సమాచారం అందుతుంది. వ్యాపారాలకు నూతన పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు.

కన్య: అనుకోని ప్రయాణాలు చెయ్యవలసిన వస్తుంది. ధన పరంగా ఒత్తిడులు పెరుగుతాయి. కొన్ని వ్యవహారాలలో చికాకులు తప్పవు. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగాలలో స్వల్ప ఇబ్బందులుంటాయి.

తుల: ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సన్నిహితులతో ముఖ్య విషయాలు చర్చిస్తారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. సోదరులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. కుటుంబ విషయంలో ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగాలలో మరింత అనుకూల వాతావరణం ఉంటుంది.


వృశ్చికం: చేపట్టిన పనులలో శ్రమాధిక్యత పెరుగుతుంది. మిత్రులతో మాట పట్టింపులుంటాయి. ముఖ్యమైన పనులు మధ్యలో విరమిస్తారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ వహించాలి. వ్యాపార, ఉద్యోగాలు గందరగోళంగా ఉంటాయి.

ధనస్సు: దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. కొన్ని పనులలో శిరోబాధలు పెరుగుతాయి. కుటుంబంలో సమస్యలు చికాకు పరుస్తాయి. పాత విషయాలు గుర్తుకు వస్తాయి. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగుపడుతుంది. ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి. వ్యాపార పరంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి.

మకరం: సంఘంలో గౌరవప్రతిష్ఠలు పెరుగుతాయి. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగప్రాప్తి కలుగుతుంది. కొన్ని వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆకస్మిక ధన ప్రాప్తి కలుగుతుంది. ఉద్యోగాలలో సానుకూల వాతావరణం ఉంటుంది.

కుంభం: ఆర్థిక విషయాలు నిరాశ కలిగిస్తాయి. వృత్తి వ్యాపారాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. మిత్రులతో స్వల్ప విభేదాలు కలుగుతాయి. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. ధన పరంగా ఇబ్బందులు తప్పవు. వ్యాపార, ఉద్యోగాలలో చికాకులు తప్పవు.

మీనం: ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. కుటుంబ సభ్యుల అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. సన్నిహితుల ప్రవర్తన కొంత చికాకు పరుస్తుంది. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. స్థిరాస్తి ఒప్పందాలు వాయిదా వేస్తారు. వ్యాపారాలు మందగిస్తాయి. వృత్తి ఉద్యోగాలు సామాన్యస్థితిలో ఉంటాయి.



# అందుకే 'బంద్' పెట్టిండ్రు

మొదటి పేజీ తరువాయి

విమర్శల జడివాన కురిపించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు మాట్లాడిన మాటలను గుర్తుచేస్తూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కాంగ్రెస్ వస్తే రైతుబంధు నిలిచిపోతుందని గతంలో కేసీఆర్ చెబితే.. 'మేమేమన్నా దీవానాగాళ్లమా.. మాకు ధిమాక్ లేదా' అని ఒకాయన మాట్లాడారు. మరి ఇవాళ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా, ఇప్పటికే నాలుగుసార్లు రైతుబంధును ఎగ్గొట్టారు. మరి ఇప్పుడు నిన్ను దీవానాగాడు అంటే తప్పా? ధిమాక్ లేనోడు అంటే తప్పా?" అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజలు తాను తిట్టిన తిట్ల కంటే ఎక్కువగా కాంగ్రెస్ నేతలను తిడుతున్నారని, ఎక్కడైనా దొరికితే తన్నేలా ఉన్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వడ్లు కొనడం లేదని, యూరియా ఇవ్వడం లేదని మండిపడ్డారు. రైతులు కష్టపడి పంట పండిద్దామంటే అటు రైతుబంధు వేయడం లేదని, ఇటు కరెంట్ కూడా సరిగ్గా ఇవ్వడం లేదని, గ్రామాల్లో రైతులు చెప్పలేని గోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో పొరపాటున కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన జిల్లాల ప్రజలంతా ఇవాళ తిరుగుబాటు మూడ్‌లో ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. మళ్లీ ఎన్నికలు ఎప్పుడు వస్తాయా.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎప్పుడెప్పుడు తరిమికొడదామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

## పతంజలి.. ఎంత మోసం!

మొదటి పేజీ తరువాయి

(అభ్యంతరకరమైన ప్రకటనలు) చట్టం కింద ఈ చర్యలు తీసుకున్నట్లు ఎఫ్‌డీఏ వెల్లడించింది. ముంబై, కొంకణ్, పుణె, నాసిక్, అమరావతి, నాగ్‌పుర్, ఛత్రపతి శంభాజీనగర్ డివిజన్లలో ఏకకాలంలో ఈ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పతంజలి బ్రాండ్ కింద మార్కెటింగ్ చేస్తున్న, హరిద్వార్‌లోని దివ్య ఫార్మసీ తయారు చేసిన మందులను కూడా పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా నాగ్‌పూర్ డివిజన్‌లో రూ.7,26,755 విలువైన మందులను, నాసిక్ డివిజన్‌లో రూ.7,10,945 విలువైన స్టాక్‌ను సీజ్ చేసినట్లు అధికారులు వివరించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని ఎఫ్‌డీఏ స్పష్టం చేసింది.

## 3న డీకే ప్రమాణం

## సీఎల్పీ నేతగా ఏకగ్రీవ ఎన్నిక

మొదటి పేజీ తరువాయి

నిపుణులు గురూజీ ఆరాధ్య స్వయంగా ఈ ముహూర్తాన్ని నిర్ణయించినట్లు శనివారం ప్రకటించారు. శివకుమార్ నివాసం వద్ద మీడియాతో మాట్లాడిన గురూజీ ఆరాధ్య, జూన్ 3 బుధవారం రోజు వృశ్చిక లగ్నంలో ప్రమాణ స్వీకారానికి శుభప్రదంగా ఉంటుందని తెలిపారు. వాస్తవానికి జూన్ 5వ తేదీని పరిశీలించినా, ఆ రోజు ఓ ముఖ్యమైన వ్యక్తి అందుబాటులో ఉండరన్న కారణంతో జూన్ 3ని ఖరారు చేసినట్లు ఆయన వివరించారు. శివకుమార్ జాతకానికి సంబంధించిన జ్యోతిష్యపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో డీకే శివకుమార్ బెంగళూరులోని అజ్జయ్య మఠాన్ని సందర్శించి స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌ను కలిసిన అనంతరం ఆయన స్వామీజీతో భేటీ అయినట్లు సమాచారం. మరోవైపు, కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతగా డీకే శివకుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిద్ధరామయ్య సీఎల్పీ నేతగా (తదుపరి సీఎంగా) డీకేఎస్ పేరును ప్రతిపాదించగా, కాంగ్రెస్ సభ్యులు బలపరిచారు.

## ఇంతి పోరు.. ఇక బతకలేను!

మొదటి పేజీ తరువాయి

కోరారు. గృహ హింస ఎదుర్కొంటున్న పురుషులకు చట్టపరమైన రక్షణ కరవైందని ఆవేదన వ్యక్తం చేశాడు. కారుణ్య మరణ అభ్యర్థనలపై జిల్లా అధికారులు స్పందించవలసి ఉంది.

## కడుపు కోతలు!

మొదటి పేజీ తరువాయి

కలవరపెడుతున్నాయి. తెలంగాణలో 98.8 శాతం డెలివరీ కేసులు ఆస్పత్రులలోనే జరుగుతున్నట్లు లెక్కలు చెప్తున్నాయి. ఈ విషయంలో జాతీయ సగటు 90.6 శాతం కంటే తెలంగాణ ముందుంది. అయితే వాటిలో 62. 2 శాతం డెలివరీలు సిజేరియన్ల రూపంలో జరగటం మాత్రం ఆందోళన రేకెత్తిస్తోంది. ఇక సిజేరియన్లకు సంబంధించి జాతీయ సగటు 27.2 శాతంగా ఉంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి సిజేరయన్లు 52.2 శాతంగా ఉన్నట్లు గణాంకాలు వెల్లడించాయి. ఈ విషయంలో నాగాలాండ్ 13.2 శాతంతో అన్నింటి కంటే ముందుంది. తెలంగాణలోని ప్రైవేట్ ఆస్పత్రులలో జరిగే డెలివరీలలో 83.9 శాతం సిజేరియన్లే ఉన్నాయట. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా సిజేరియన్ల వాటా 48.1 శాతం కావటం గమనార్హం. ఈ విషయంలో జాతీయ సగటు 16.9 శాతంగా ఉంది. ఇక గర్భ నిర్ధారణ అయిన తర్వాత మొదటి వంద రోజుల వరకూ ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడే గర్భిణులు తెలంగాణలో ఎక్కువగా ఉన్నారు. తెలంగాణలోని 81 శాతం మంది గర్భిణులు ఈ మాత్రలను వాడుతున్నారు. ఈ విషయంలో జాతీయ సగటు 54.9 కంటే తెలంగాణ చాలా ముందుంది.

## పచ్చ కారట.. ట్రంప్ ఊరట

మొదటి పేజీ తరువాయి

పరిశీలన జరుగుతున్నప్పుడు కూడా వారు అమెరికాలో ఉండేందుకు అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. తాజా ప్రకటనతో అమెరికాలో శాశ్వత నివాసం కోసం దరఖాస్తు చేసుకున్న భారతీయులకు భారీ ఊరట లభించినట్టయ్యింది. అమెరికాలో నివసిస్తున్న విదేశీయుల్లో చైనా (52 లక్షలు) తర్వాతి స్థానం భారతీయులదే. అయితే, వీసా గడువు ముగిసినా దేశంలోనే ఉండిపోవడం లేదా ఇమిగ్రేషన్‌కు సంబంధించిన ఇతర అంశాలను మాత్రం తాము పరిగణనలోకి తీసుకుంటామని సూచనప్రాయంగా తెలిపింది. హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ వివరణ ఇచ్చినప్పటికీ.. గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తుచేసిన వలసదారులు ఎటువంటి పరిస్థితుల్లో అమెరికాను విడిచి వెళ్లాల్సిన అవసరం ఉంటుందనేది మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో వలసదారుల్లో పలు ప్రశ్నలు మిగిలేఉన్నాయి. గతవారం వెలువరించిన మార్గదర్శకాలపై ఆ శాఖలోని కొంతమంది అధికారులు కూడా వాటి పరిధిపై అనిశ్చితితో ఉన్నారని సమాచారం. ది న్యూయార్క్ టైమ్స్ ప్రకారం.. వైట్ హౌస్‌కు చెందిన ఒక సీనియర్ అధికారి ఈ చర్యను వలసల వ్యూహంలో ఒక ముఖ్యమైన మార్పుగా కాకుండా, ఒక సాధారణ పరిపాలనాపరమైన విషయంగా అభివర్ణించారు.

# మేం రైతు 'బంధు'లం

మొదటి పేజీ తరువాయి

తాము మీటర్లు పెట్టకుండా ఉచిత విద్యుత్‌ను విజయవంతంగా కొనసాగిస్తే, బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటుందా? అని నిలదీశారు. 'రైతు డిస్కం' ఏర్పాటు వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని రేవంత్ రెడ్డి వివరించారు. రైతులకు 24 గంటల పాటు నాణ్యమైన, అంతరాయం లేని ఉచిత విద్యుత్ అందించడంతో పాటు, జవాబుదారీతనం పెంచడమే దీని లక్ష్యమని తెలిపారు. దేశంలోనే ఇలాంటి ఏర్పాటు చేయడం ఇదే తొలిసారని ఆయన పేర్కొన్నారు. బ్లాక్‌మెయిల్ చేయడం బీఆర్ఎస్ నేతలకు అలవాటుగా మారిందని, ఎలాంటి ప్రతిపాదన లేకుండానే పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు ఎవరెవరితో మాట్లాడుతున్నారో తన దగ్గర పూర్తి సమాచారం ఉందని, వచ్చే ఎన్నికల నాటికి ఆయన ఏ పార్టీలో ఉంటారో ఆయనకే తెలియదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌లోనే ఉంటానని కేసీఆర్‌పై ఒట్టేసి చెప్పాలని సవాల్ విసిరారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ కలిసే పోటీ చేస్తాయని జోస్యం చెప్పారు. ధాన్యం కొనుగోలు అంశాన్ని కూడా ప్రస్తావించిన సీఎం, మద్దతు ధర ప్రకటించిన కేంద్రమే వడ్లు



కొనాలని, లేదంటే జూన్ 15 తర్వాత బీజేపీ నేతల ఇళ్ల ముందు వడ్ల కుప్పలు పోస్తామని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలోని విద్యుత్, కాళేశ్వరం అక్రమాలపై సీబీఐకి ఫిర్యాదు చేశామని, దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. తాను 2034 వరకు తెలంగాణ రాజకీయాల్లోనే ఉంటానని, 2029లో కూడా కాంగ్రెస్ పార్టీయే గెలుస్తుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# బంగారం దుకాణ్లు వెలవెల

మొదటి పేజీ తరువాయి

ఆహార ధరలు తోడవడంతో జనం అసలు షాపుల వైపు వెళ్లడమే మానేశారు. కేవలం రెండు వారాల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా పసిడి డిమాండ్ ఊహించని విధంగా 70 శాతం మేర పడిపోయింది. బంగారం దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని కేంద్ర ప్రభుత్వం 6 శాతం నుంచి ఏకంగా 15 శాతానికి పెంచింది. దీనికి జీఎస్టీ కూడా చేరడంతో పసిడిపై పడే మొత్తం పన్ను భారం 9.18 శాతం నుంచి 18.45 శాతానికి చేరింది. రూపాయి విలువ పతనం కావడం, క్రూడాయిల్ ధరలు పెరగడంతో విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడానికి ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. పన్నుల పెంపు దెబ్బకు దేశవ్యాప్తంగా పసిడి కొనుగోళ్లు భారీగా పడిపోయాయని 'ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్' వెల్లడించింది. గతేడాది మే నెల చివరి రెండు వారాల్లో 25 టన్నులుగా ఉన్న బంగారం డిమాండ్ ఈసారి కేవలం 7.5 టన్నులకే పరిమితమైంది. దేశీయ బంగారం వ్యాపారంలో 65 శాతం వాటా ఉన్న అసంఘటిత రంగం ఈ నిర్ణయంతో తీవ్రంగా ప్రభావితమైంది. ఈ ఏడాది బంగారానికి దూరంగా ఉండాలంటూ ప్రధానమంత్రి మోదీ దేశ ప్రజలకు చేసిన విజ్ఞప్తి కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనితో పాటు పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరగడంతో మధ్యతరగతి కుటుంబాలు పసిడి కొనుగోళ్లను వాయిదా వేసుకుంటున్నాయి. ప్రస్తుతం ముంబై స్పాట్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర ఏకంగా రూ.1.57 లక్షలు పలుకుతుండటం గమనార్హం. బంగారం ధరలు ఆకాశాన్ని తాకడంతో కొనుగోలుదారులు తమ బడ్జెట్‌కు తగ్గట్టుగా తక్కువ క్యారెట్ ఉన్న లైట్‌వెయిట్ నగల వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. మరోవైపు మార్కెట్‌లో ధరలు ఎక్కువగా ఉండటాన్ని ఆసరాగా చేసుకొని చేతిలో డబ్బుల కోసం తమ పాత నగలను అమ్మి క్యాష్ చేసుకునేందుకు జనం జువెలరీ షాపుల వద్ద క్యూ కడుతున్నారు.

# గోల్డ్ బాండ్లతో పైసల గలగల

మొదటి పేజీ తరువాయి

బాండ్లకు సంబంధించిన ప్రీమెచ్యూర్ రిడెంప్షన్ ప్రైస్ (ముందస్తు విమోచన ధర) ప్రకటించింది. పెట్టుబడిదారులకు ఊహించని రీతిలో ఏకంగా 227 శాతం అద్భుతమైన రాబడిని అందించేలా యూనిట్‌కు రూ.15,672గా ధరను ఖరారు చేసింది. అంటే.. ఇక్కడ ఐదేళ్ల కిందట రూ. 1 లక్ష ఇన్వెస్ట్ చేసినట్లయితే వారికి ఇప్పుడు రూ. 3.27 లక్షల వరకు రాబడి వచ్చింది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం సావరిన్ గోల్డ్ బాండ్లను జారీ చేసిన ఐదేళ్ల తర్వాత, వడ్డీ చెల్లించే తేదీల్లో వాటిని ముందస్తుగానే డబ్బుల్ని విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ సిరీస్ బాండ్లను 2021 జూన్ 1న జారీ చేసినందున, సరిగ్గా ఐదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ ఏడాది జూన్ 1 నుంచి పెట్టుబడిదారులు తమ బాండ్లను నగదుగా మార్చుకునేందుకు ఆర్‌బీఐ అనుమతి ఇచ్చింది. ముందస్తు విమోచన ధరను నిర్ణయించడానికి ఆర్‌బీఐ ఒక నిర్దిష్ట పద్ధతిని అనుసరిస్తుంది. ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) ప్రచురించే 999 స్వచ్ఛత కలిగిన బంగారం ధర ఆధారంగా దీనిని లెక్కిస్తారు. విమోచన తేదీకి ముందున్న మూడు పని దినాల బంగారం ముగింపు ధరల సగటును తీసుకుంటారు. ఈ సిరీస్ కోసం మే 26, మే 27, మే 29 తేదీల నాటి బంగారం ధరల సగటు ఆధారంగా రూ.15,672గా ధరను నిర్ణయించారు. 2021లో ఈ బాండ్లను జారీ చేసినప్పుడు, ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వారికి ఒక గ్రాము (యూనిట్) ధర రూ.4,792గా ఉంది. ఆఫ్‌లైన్‌లో కొన్నవారికి దీని ధర రూ.4,842గా ఉంది. ఇప్పుడు ఆర్‌బీఐ ప్రకటించిన విమోచన ధర రూ.15,672తో పోలిస్తే, ఆన్‌లైన్ పెట్టుబడిదారులకు ప్రతి గ్రాముపై వడ్డీని మినహాయించి రూ.10,880 నికర లాభం వస్తోంది. అంటే.. కేవలం ఐదేళ్ల కాలంలోనే వారి పెట్టుబడిపై 227.05 శాతం రాబడి లభించినట్లయింది. సాధారణంగా ఎస్‌జీబీల కాలపరిమితి 8 సంవత్సరాలు కాగా, ఐదేళ్ల తర్వాత ఇలాంటి అధిక రాబడితో బయటకు వచ్చే అవకాశం కల్పించడం పెట్టుబడిదారులకు ఎంతో లాభదాయకంగా మారింది.


## ఎల్‌నినో.. ఎంత పని జేస్తివి!

మొదటి పేజీ తరువాయి

ఆ తర్వాత వర్షాలు తగ్గుముఖం పడతాయి. దీంతో నెల మొత్తం మీద వర్షపాతం తక్కువగానే నమోదవుతుంది' అని నీతా గోపాల్ తెలిపారు. ఎల్ నినో సంవత్సరంలో వర్షపాతం ఇలాగే అస్థిరంగా ఉంటుందని, కొన్నిసార్లు మంచి వర్షాలు కురిసి, ఆ తర్వాత పొడి వాతావరణం ఏర్పడుతుందని వెల్లడించారు. ఇదిలా ఉండగా, శనివారం సాయంత్రం ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉరుములు, బలమైన గాలులతో కూడిన వర్షం పలు ప్రాంతాలను ముంచెత్తింది. గత కొద్ది రోజులుగా నెలకొన్న తీవ్రమైన వేడి, ఉక్కపోత నుంచి ఈ వర్షం ప్రజలకు ఉపశమనం కలిగించింది. జూన్ 4 వరకు ఢిల్లీలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది. రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లోనూ వాతావరణంలో మార్పులు కనిపించాయి. చురు, హనుమాన్‌గఢ్, శ్రీ గంగానగర్, బికనీర్ వంటి ప్రాంతాల్లో ఇసుక తుపానులు సంభవించగా, జైపూర్‌లో బలమైన గాలులతో వర్షం కురిసింది. కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో వడగళ్ల వాన పడినట్లు సమాచారం.

# రాతి కట్టడంతో కాళేశ్వర ఆలయం!

**ఆలయ పునర్నిర్మాణానికి దేవాదాయశాఖ సన్నాహాలు**



కాళేశ్వరం, మే 30 (ఈవార్తలు): ప్రముఖ శైవక్షేత్రం, దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం త్వరలో సరికొత్త వైభవాన్ని సంతరించుకోనుంది. దశాబ్దాల క్రితం నిర్మించిన పాత ఆలయాలు, మండపాలు, ప్రాకారాల స్థానంలో అత్యంత పటిష్టమైన, దీర్ఘకాలం మన్నేలా ఉండే శాశ్వత రాతి కట్టడాల నిర్మాణానికి దేవాదాయశాఖ శ్రీకారం చుట్టింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.198 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రకటించడమే కాకుండా.. పరిపాలనా అనుమతులను కూడా మంజూరు చేసింది. ఈ మహత్తర పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి గానూ.. ప్రస్తుతం ఆలయ ఆవరణలో ఉన్న పాత కట్టడాలను తొలగించేందుకు దేవాదాయశాఖ అధికారులు తుది కసరత్తు చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సంబంధించి గత నెల ఏప్రిల్ 20వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా కాళేశ్వర క్షేత్రంలో భూమిపూజ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. జూన్ చివరి వారంలో పాత నిర్మాణాల తొలగింపు ప్రక్రియను అధికారికంగా ప్రారంభించే అవకాశాలు ఉన్నట్లు ఆలయ వర్గాల ద్వారా తెలుస్తోంది. గతంలో 1982 సంవత్సరానికి ముందు పూర్వకాలం నాటి ఆలయాలు ఉండగా.. వాటిని తొలగించి అప్పట్లో నూతన కట్టడాలు చేపట్టారు. ఆ తర్వాత శృంగేరి పీఠాధిపతుల సమక్షంలో జీర్ణోద్ధరణ, మహా కుంభాభిషేకం నిర్వహించారు. అయితే ఆ సమయంలో నిర్మించిన ఆలయాలు, చుట్టుపక్కల ఉన్న ప్రాకారాలు ప్రస్తుతం పూర్తిగా మరమ్మతులకు లోనయ్యాయి. దీంతో భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత రాతి నిర్మాణాల కోసం దేవాదాయశాఖ పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. కాళేశ్వర క్షేత్రానికి శృంగేరి శారదా పీఠంతో అత్యంత పురాతన, ఆధ్యాత్మిక అనుబంధం ఉంది. ఈ నేపథ్యంలోనే ఈ మహా పునర్నిర్మాణ ప్రక్రియకు శృంగేరి పీఠం నుంచి దేవాదాయశాఖ ముందస్తు అనుమతులు పొందినట్లు సమాచారం. అయితే, ఈ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన కొన్ని కొత్త కట్టడాలను సైతం మాస్టర్ ప్లాన్ డిజైన్ కోసం తొలగించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. యముడు, శివుడు కొలువై ఉన్న ప్రధాన గర్భాలయంతో పాటు శుభానంద దేవి ఆలయం, సరస్వతీ ఆలయం, అభిషేక మండపం, అనివెట్టి మండపం, రెండు కల్యాణ మండపాలు, చుట్టూ ఉన్న ప్రాకార నిర్మాణాలన్నీ తొలగింపు జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. నలుదిక్కులా ఉన్న వైభోగ రాజగోపురాలను సైతం తొలగించి సరికొత్తగా నిర్మిస్తారనే ప్రచారం స్థానికంగా జోరుగా సాగుతోంది. ఈ మహా ప్రాజెక్టుపై భక్తుల్లో హర్షం వ్యక్తమవుతున్నప్పటికీ.. కాలపరిమితిపై కొన్ని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాబోయే 2027 జూలై నెలలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. పుష్కరాల సమయానికి దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు కాళేశ్వర క్షేత్రానికి తరలివస్తారు. ఈలోగా ఈ భారీ రాతి నిర్మాణ పనులన్నీ పూర్తి చేసి కుంభాభిషేకం నిర్వహించడం సాధ్యమేనా? అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. కేవలం ఏడాదిన్నర కాలం మాత్రమే సమయం ఉన్నందున పనుల్లో హడావుడి పెరిగి నిర్మాణ నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతుందేమోనని స్థానికులు, నిపుణులు చర్చించుకుంటున్నారు.

## కాళేశ్వరంలో చుక్క నీరు లేదు!

**ప్రాజెక్టు పరిస్థితిపై బండారు దత్తాత్రేయ ఆవేదన**

గోదావరిఖని/పెద్దపల్లి బ్యూరో, మే 30 (ఈవార్తలు): మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ గోదావరిఖనిలో పర్యటించిన సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిన ఉదంతంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఇప్పటికే ఒక స్పష్టమైన నివేదికను ఇచ్చిందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. దాదాపు లక్ష కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుతం రైతులకు గానీ, ప్రజలకు గానీ ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని దత్తాత్రేయ విమర్శించారు. ఇంత పెద్ద ప్రాజెక్టు నిరుపయోగంగా మారినప్పటికీ, దానికి అవసరమైన అత్యవసర మరమ్మతులు చేపట్టడంలో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వానికి సరైన చిత్తశుద్ధి కనిపించడం లేదని ఆయన ఆరోపించారు. ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకపోవడం వల్ల జరుగుతున్న నష్టాన్ని దత్తాత్రేయ వివరించారు. కాళేశ్వరం నీటిపై ఆధారపడిన ఉత్తర తెలంగాణ జిల్లాల రైతులు ప్రస్తుతం సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మూడు ప్రధాన బ్యారేజీల్లో ప్రస్తుతం బొట్టు నీరు కూడా లేకపోవడం అత్యంత ఆందోళనకరమైన విషయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా కాలయాపన చేయకుండా తక్షణమే స్పందించి, కాళేశ్వరం ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిపుణుల సూచనల మేరకు పనులను వేగవంతం చేసి, ఉత్తర తెలంగాణ రైతాంగానికి సాగునీరు అందించే బాధ్యతను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన స్వీకరించాలని బండారు దత్తాత్రేయ హితవు పలికారు.

## పేద విద్యార్థినికి అండగా కోమటిరెడ్డి

**స్కూలు ఫీజు చెల్లించి సర్టిఫికెట్లు ఇప్పించిన మంత్రి**

బోడుప్పల్, మే 30 (ఈవార్తలు): భవిత అనే విద్యార్థిని బోడుప్పల్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతూ పది పరీక్షల్లో 582 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. అయితే ఇంటర్‌లో చేరేందుకు సర్టిఫికెట్లు ఇవ్వాలని స్కూలు యాజమాన్యాన్ని సంప్రదించగా.. ఫీజు బకాయి చెల్లిస్తేనే ఇస్తామని స్కూలు మేనేజ్‌మెంట్ స్పష్టం చేసింది. స్కూలు ఫీజు కట్టలేక భవిత కుటుంబం నానా ఇబ్బందులు పడుతూ ఉండటాన్ని స్థానికంగా ఉండే ఓ యూట్యూబర్ ఇన్‌స్టాలో షేర్ చేశారు. దీంతో ఈ వీడియో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వద్దకు చేరింది. దీనిపై ఆరా తీసిన మంత్రి తన కార్యాలయం అధికారులను అప్రమత్తం చేశారు. మంత్రి కార్యాలయం ఆరా తీస్తే విద్యార్థిని తల్లిదండ్రులు వెంకన్న, దేవకి వ్యాపారంలో నష్టపోయి ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నట్లు తెలిసింది. వెంటనే స్కూలు ప్రిన్సిపల్‌తో మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. విద్యార్థిని ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని తన వద్దకు రావాలని ఆదేశించారు. దీంతో సర్టిఫికెట్లతో ప్రిన్సిపల్ మంత్రి క్వార్టర్స్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే భవిత కుటుంబం కూడా అక్కడకు చేరుకోగా.. విద్యార్థిని భవితతో మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి.. ఆమె కుటుంబం పరిస్థితి తెలిసి చలించిపోయారు. పది పరీక్షల్లో మాత్రమే కాకుండా పాలిసెట్‌లో రాష్ట్రస్థాయిలో 634 ర్యాంక్ సాధించిన సంగతి తెలుసుకుని అభినందించారు. అనంతరం స్కూల్ ప్రిన్సిపల్‌ను మందలించిన మంత్రి కోమటిరెడ్డి.. అక్కడికక్కడే భవిత స్కూల్ ఫీజు 60 వేలు చెల్లించి, విద్యార్థినికి సర్టిఫికెట్లు అందేలా చూశారు. భవిత ఖర్చుల కోసం మరో 20 వేలు అందించారు. ఉన్నత చదువులకు అండగా ఉంటానంటూ భరోసా కల్పించారు. ఏ అవసరం ఉన్నా తనను సంప్రదించాలని సూచించారు.

## జీహెచ్ఎంసీకి ఎలక్ట్రిక్ కార్లు

**పెట్రో రేట్ల నేపథ్యంలో జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం**

హైదరాబాద్, మే 30 (ఈవార్తలు): దేశంలో ఇంధన ధరల రేట్లు పెరుగుతున్నాయి. నాలుగు రోజులకు ఒకసారి చమురు సంస్థలు పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచుతున్న పరిస్థితి. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఇంధన ధరల పెరుగుదల చోటుచేసుకుంటోంది. ఈ నేపథ్యంలో ఇంధన ధరల భారాన్ని తగ్గించుకునేందుకు ఇప్పటికే ప్రభుత్వాలు పొదుపు చర్యలు ప్రారంభించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజారవాణా వ్యవస్థ వినియోగం, నోవెహికల్ డే వంటి విధానాలను అనుసరిస్తున్నారు. ఈ క్రమంలోనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ( జీహెచ్ఎంసీ ) కీలక నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రిక్ కార్లు కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ పాలకమండలి ఏర్పాటైన తర్వాత జీహెచ్ఎంసీ మేయర్ , డిప్యూటీ మేయర్‌తో పాటుగా అధికారుల కోసం ఎలక్ట్రిక్ కార్లు కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మూడు కార్పొరేషన్ల ప్రత్యేకాధికారి జయేష్ రంజన్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. డ్రైవర్ కమ్ ఓనర్, అద్దె ప్రాతిపదికన జీహెచ్ఎంసీ కార్లు ఉపయోగిస్తోంది. వీటి స్థానంలో తొలి దశలో 45 ఎలక్ట్రిక్ కార్లు కొనాలని స్టాండింగ్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు, మేయర్ , డిప్యూటీ మేయర్‌తో పాటుగా కమిషనర్, అడిషినల్ కమిషనర్, జోనల్, డిప్యూటీ కమిషనర్ల కోసం వీటిని వినియోగించనున్నారు. మరోవైపు ఎలక్ట్రిక్ కార్లు కొనాలనే జీహెచ్ఎంసీ ఆలోచన ఇప్పటిది కాదు. గతంలోనే ఈ ఆలోచన చేసినప్పటికీ.. పలు కారణాలతో ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు.



# రూ.5,500 కోట్ల భూ కబ్జా!

**కుట్రలు భగ్నం చేసిన హైడ్రా.. ముష్కిన్ చెరువు చెరకు యత్నం**

హైదరాబాద్, మే 30 (ఈవార్తలు): హైదరాబాద్ శివారు ప్రాంతంలో భారీ భూకబ్జా యత్నాన్ని హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) అధికారులు భగ్నం చేశారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలోని పుప్పాలగూడ, నార్సింగి సమీపంలో ఉన్న ముష్కిన్ చెరువును ఆక్రమించుకునేందుకు కొందరు చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారు. సుమారు రూ.5,500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడారు. వివరాల్లోకి వెళితే, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ముష్కిన్ చెరువుపై కన్నేశారు. పేదలతో గుడిసెలు వేయించి, భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. గ్రామ రికార్డుల ప్రకారం 59.11 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువు మధ్యలో ఏకంగా మట్టితో కట్ట నిర్మించి, 34 ఎకరాలకు పైగా భూమిని కబ్జా చేసేందుకు ప్లాన్ చేశారు. ఈ విషయంపై దృష్టి సారించిన హైడ్రా అధికారులు, ఆక్రమణదారులకు రెండు నెలల క్రితమే నోటీసులు జారీ చేశారు. అయినా వారు ఖాళీ చేయకపోవడంతో శనివారం చెరువు మధ్యలో నిర్మించిన అక్రమ కట్టను, గుడిసెలను పూర్తిగా తొలగించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చెరువు సరిహద్దుల వెంబడి ఫెన్సింగ్ ఏర్పాటు చేసే పనులను ప్రారంభించారు. నగరంలోని చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# డ్రగ్స్, సైబర్ దొంగల పనిపడతాం

**నేరాల అడ్డుకట్టకు గ్రేహౌండ్స్, ఎస్ఐబీ.. ట్రాఫిక్, కల్తీ ఆహారం, విజిలెన్స్ కోసం త్వరలో సరికొత్త విభాగాలు**

**డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడి**



హైదరాబాద్, మే 30 (ఈవార్తలు): రాష్ట్ర పోలీస్ శాఖలో జవాబుదారీతనం, పారదర్శకత, నెలకొల్పడమే లక్ష్యంగా.. మారుతున్న సామాజిక పరిస్థితులు, సరికొత్త సవాళ్లకు అనుగుణంగా పోలీస్ శాఖ పనితీరులో మార్పు రావాలని డీజీపీ సీవీ ఆనంద్ ఆకాంక్షించారు. ఈ మేరకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, కమాండెంట్లు, డీఎస్పీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గడిచిన మూడు దశాబ్దాలుగా నక్సలిజం అణచివేతపైనే రాష్ట్ర పోలీస్ ప్రధానంగా దృష్టి సారించిందని డీజీపీ గుర్తుచేశారు. గత 15 ఏళ్లుగా నక్సల్స్ ప్రభావం దాదాపుగా కనుమరుగైనందున.. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా గ్రేహౌండ్స్, ఎస్ఐడి వంటి ప్రత్యేక విభాగాల ప్రాధాన్యతను పునఃసమీక్షించి, డ్రగ్స్, సైబర్ నేరాలను అరికట్టడం పైనే ఇకపై పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో దృష్టి పెడుతుంది అన్నారు. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టి, రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ నిర్వహణను ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు త్వరలోనే ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా, కల్తీ ఆహారాన్ని అడ్డుకునేందుకు ఫుడ్ అడల్టరేషన్ వింగ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలను పకడ్బందీగా ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. మహిళలు, బాలల భద్రత, అక్రమ రవాణా విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేకుండా భరోసా కేంద్రాలు, షీ టీమ్స్‌ను మరింత బలోపేతం చేయాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో సీసీటీఎన్ఎస్ 2.0 సాఫ్ట్‌వేర్ పనితీరు, ఇతర సాంకేతిక పరిజ్ఞానం అమలు సరిగా లేకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు, టెక్ వ్యవస్థలను నిరంతరం పర్యవేక్షించేందుకు సీఐడీ డీజీ, టెక్నికల్ సర్వీసెస్ డీజీల నేతృత్వంలో యువ ఐపీఎస్ అధికారులతో కూడిన ప్రత్యేక డీజీపీ టెక్ టీమ్ ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు హాక్ ఐ అల్ట్రా, టీజీ కాప్ అల్ట్రా వంటి అప్లికేషన్లను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. విధుల్లో నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘన, అవినీతి, పద్ధతులు పాటించకపోవడం వంటి ధోరణులను ఏమాత్రం సహించేది లేదని హెచ్చరించారు. కిందిస్థాయి సిబ్బంది ఎల్లప్పుడూ పైఅధికారులకు, అలాగే ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం ఇవ్వాలని, తోటి సిబ్బందితో సమన్వయం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఉన్నతాధికారులు కేవలం పర్యవేక్షకులుగా కాకుండా నిజమైన నాయకులుగా సిబ్బందిని ముందుండి నడిపించాలని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రంలోని ప్రతి పోలీస్ స్టేషన్, ప్రతి యూనిట్ కార్యాలయంలో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదుదారుల కోసం తప్పనిసరిగా సమయం కేటాయించాలని ఆదేశించారు. జిల్లాల్లో అధికారుల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, వారికి మార్గనిర్దేశం చేసేందుకు నలుగురు ప్రత్యేక డీఐజీలను నియమించనున్నట్లు తెలిపారు. ప్రతి నెలా 15వ తేదీలోపు క్రైమ్ రివ్యూ మీటింగ్‌లు నిర్వహించి, ఆ నివేదికలను అదే నెల 20 లోపు డీజీపీ కార్యాలయానికి, సీఐడీకి పంపాలని సూచించారు. యూనిట్ అధికారులు నెలకు కనీసం రెండు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి స్పష్టం చేశారు.

# బీజేపీ నెక్స్ట్ టార్గెట్ తెలంగాణే: టీపీసీసీ చీఫ్

హైదరాబాద్, మే 30 (ఈవార్తలు): బీజేపీ తదుపరి లక్ష్యంగా పంజాబ్, తెలంగాణ రాష్ట్రాలను ఎంచుకుందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై తెలంగాణ కాంగ్రెస్ ప్రత్యేక నిఘా ఉంచుతుందని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని, దేశవ్యాప్తంగా సెక్యులర్ ఓటర్లను లక్ష్యంగా చేసుకుని ఓట్ల తొలగింపు ప్రక్రియ జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన అన్నారు. శనివారం గాంధీభవన్ ప్రాంగణంలోని ఇందిరా భవన్ లో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ), సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్లు (ఎస్ఎస్ఏ)లతో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాలను నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయనే అనుమానాల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతి మూడు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా జరిగిన ఈ సమావేశాలకు ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్లు, రాష్ట్ర స్థాయి ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్లు హాజరయ్యారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బూత్ స్థాయి నుంచి పార్టీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, ఓటర్ల జాబితాలో అక్రమాలకు తావులేకుండా చర్యలు చేపట్టడం లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఈ సమీక్ష సమావేశాలను నిర్వహిస్తున్నట్లుగా నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఒక రాష్ట్రంలో 90 లక్షలకు పైగా ఓట్లను తొలగించి, కేవలం 30 లక్షల కొత్త ఓట్లను మాత్రమే జాబితాలో చేర్చిన పరిస్థితులు కనిపిస్తున్నాయని, పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ విజయానికి ఓటర్ల తొలగింపు ప్రక్రియ కూడా ఒక కారణమని ఆయన ఆరోపించారు. ప్రతి వారం మంత్రులు తమ తమ నియోజకవర్గాల్లో పర్యటిస్తూ పార్టీ నిర్మాణం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ఓటర్ల జాబితా పరిశీలన వంటి అంశాలపై దృష్టి సారిస్తారని మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.





## ఎండలో రైతులు.. ఏసీ రూముల్లో మంత్రులు

**రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరి: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

హైదరాబాద్, మే 30 (ఈవార్తలు): మార్పు పేరుతో దొంగ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా, నిస్సిగ్గుగా వ్యవహరిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దళారులు, రైస్ మిల్లర్ల చేతుల్లో చిక్కి రైతులు విలవిలలాడుతుంటే, మంత్రులు ఏసీ రూముల్లో గడుపుతున్నారని మండిపడ్డారు. ధాన్యం సేకరణలో రాష్ట్ర ప్రభుత్వ చేతకానితనాన్ని కేంద్రంపై నెట్టేయాలని చూస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. కేంద్రం ఎప్పుడూ తెలంగాణ నుంచి ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువ ధాన్యాన్ని సేకరిస్తోందని స్పష్టం చేశారు. 52.24 లక్షల మెట్రిక్ టన్నుల ఒప్పందానికి గాను, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 51 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించగలిగిందని గణాంకాలను వెల్లడించారు. ఇక్కడ పండే నాణ్యమైన సన్న బియ్యాన్ని ఎక్కువ ధరకు ఇతర రాష్ట్రాలకు అమ్ముకుంటూ, పేద ప్రజలకు మాత్రం ఇతర రాష్ట్రాల నుండి తెచ్చిన నాసిరకం బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేవలం కమీషన్లు, భూ దందాలపైనే శ్రద్ధ పెడుతూ, రైతుల ఉసురు పోసుకుంటున్నాయని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఐమ్యాక్స్ స్క్రీన్ వచ్చేస్తోంది!

**12 ఏళ్ల తర్వాత మళ్లీ హైదరాబాద్‌కు**

**ధ్రువీకరించిన ఏషియన్ సునీల్ నారంగ్**

**నాలుగైదు రోజుల్లో అధికారిక ప్రకటన**

హైదరాబాద్, మే 30 (ఈవార్తలు): హైదరాబాద్‌ను వీడి దాదాపు 12 ఏళ్లు అవుతున్న ఐమ్యాక్స్ స్క్రీన్ అనుభూతి మళ్లీ అందుబాటులోకి రానుంది. ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ఏషియన్ సునీల్ నారంగ్ ఈ విషయాన్ని ధృవీకరించారు. తమ ప్రాపర్టీస్‌లో ఒకచోట ఐమ్యాక్స్ స్క్రీన్‌ను ఏర్పాటు చేస్తున్నామని, దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన నాలుగైదు రోజుల్లో వెల్లడిస్తామని ఆయన తెలిపారు. గతంలో హైదరాబాద్‌లోని ప్రసాద్స్ మల్టీప్లెక్స్‌లో ఐమ్యాక్స్ స్క్రీన్ ఉండేది. 2003లో ప్రారంభమైన ఈ థియేటర్, దేశంలోని తొలి ఐమ్యాక్స్ థియేటర్లలో ఒకటిగా నిలిచింది. అయితే, 2014లో 70ఎంఎం ఫార్మాట్ ప్రదర్శనలను నిలిపివేశారు. క్రిస్టోఫర్ నోలన్ దర్శకత్వం వహించిన 'ఇంటర్‌స్టెల్లార్' అక్కడ ప్రదర్శించిన చివరి భారీ చిత్రాలలో ఒకటి. అప్పటి నుంచి నగరంలో ఐమ్యాక్స్ లేని లోటు కొనసాగుతోంది. తాజా ప్రకటనతో ఈ సుదీర్ఘ నిరీక్షణకు తెరపడనుంది. అయితే, ఈ కొత్త ఐమ్యాక్స్ స్క్రీన్‌ను ఎక్కడ ఏర్పాటు చేస్తారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సుదర్శన్ 70ఎంఎం థియేటర్‌ను పునరుద్ధరించి అక్కడ ఏర్పాటు చేయవచ్చని లేదా హకీంపేటలోని కొత్త ప్రాజెక్టులో భాగంగా రావొచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ వార్తతో సినీ ప్రియులు సోషల్ మీడియాలో తమ ఆనందాన్ని పంచుకుంటున్నారు.



# ధర్మ హింస తప్పేం కాదు!

**అహింసతో అన్ని సమస్యలు పరిష్కారం కావు**

**ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్**

**సైనికుల త్యాగాలను గౌరవించాలని సూచన**

లక్నో: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దేశ భద్రత, అహింస, ధర్మరక్షణపై కీలక వ్యాఖ్యలు చేశారు. లక్నోలో నిర్వహించిన 'నౌసేన శౌర్య వాటిక' ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ... అహింస మానవాళికి పరమ ధర్మమే అయినప్పటికీ, దేశానికి లేదా సమాజానికి ఎవరైనా ముప్పుగా మారినప్పుడు కేవలం అహింసతోనే సమస్యలు పరిష్కారం కావని స్పష్టం చేశారు. దేశాన్ని, ధర్మాన్ని కాపాడే క్రమంలో అవసరమైతే బలప్రయోగం లేదా 'ధర్మ హింస' చేయడం కూడా అంతే ముఖ్యమన్నారు. బలహీనులను ప్రపంచం ఎప్పుడూ గౌరవించదని, భద్రతాపరంగా శక్తివంతమైన దేశాలతోనే ఇతర దేశాలు స్నేహాన్ని కోరుకుంటాయని యోగి పేర్కొన్నారు. శాంతిభద్రతలు సజావుగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని చెబుతూ.. 2017కు ముందు యూపీలో మాఫియా ఆధిపత్యం, నేరాలు ఎక్కువగా ఉండేవని, బీజేపీ పాలనలో శాంతిభద్రతలు పూర్తిగా మెరుగయ్యాయని గుర్తుచేశారు. దేశ సరిహద్దుల్లో అహర్నిశలు శ్రమిస్తూ భారతదేశాన్ని కాపాడుతున్న సైనికుల త్యాగాలను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని సీఎం యోగి ఆదిత్యనాథ్ పిలుపునిచ్చారు.



# రాజస్థాన్‌లో భారీ ఇసుక తుఫాను

**చురు, బికనీర్, శ్రీ గంగానగర్‌పై తీవ్ర ప్రభావం**

జైపూర్: రాజస్థాన్‌లోని పలు జిల్లాలను శనివారం శక్తిమంతమైన ఇసుక తుపాను ముంచెత్తింది. దట్టమైన ధూళి మేఘాలు ఆకాశాన్ని కమ్మేయడంతో వాతావరణం ఒక్కసారిగా అంధకారంగా మారింది. ఇసుక తుపాను అనంతరం భారీ వర్షం కురిసింది. ఈ తుపాను ప్రభావం చురు జిల్లాపై అధికంగా కనిపించగా, బికనీర్, శ్రీ గంగానగర్ జిల్లాల్లోనూ జనజీవనం అస్తవ్యస్తమైంది. సుమారు 30 నిమిషాల పాటు బలమైన ఈదురు గాలులతో కూడిన ఈ తుపాను బీభత్సం సృష్టించింది. ఈ గాలులకు ఇసుక భారీగా కొట్టుకొచ్చి రోడ్లు, నివాస ప్రాంతాలను కప్పేసింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల రహదారులపై కొన్ని అడుగుల మేర ఇసుక పేరుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తుపాను సమయంలో దారి కనిపించక ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ప్రస్తుతం కొనసాగుతున్న పశ్చిమ అలజడుల ప్రభావం వల్లే ఈ ప్రాంతంలో తరచూ ఉరుములు, వర్షాలతో కూడిన ఇసుక తుపానులు ఏర్పడుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ తుపానుల వల్ల తీవ్రమైన ఎండల నుంచి కొంత ఉపశమనం లభించినప్పటికీ, రవాణా, విద్యుత్ సరఫరా వ్యవస్థలకు అంతరాయం కలుగుతోంది. శ్రీ గంగానగర్ వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 48 డిగ్రీలు దాటడం అక్కడి తీవ్ర పరిస్థితులకు అద్దం పడుతోంది. ఈ ఘటనలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ నష్టం గానీ, పెద్ద ఎత్తున ఆస్తి నష్టం గానీ జరిగినట్లు సమాచారం అందలేదని అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లోనూ బికనీర్, షెఖావతి ప్రాంతాల్లో ఇలాంటి వాతావరణ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు.

# స్పైస్‌జెట్‌కు కష్టాలు

**రూ. 124 కోట్ల జీఎస్టీ డిమాండ్ నోటీసు**

న్యూఢిల్లీ: ప్రముఖ బడ్జెట్ విమానయాన సంస్థ స్పైస్‌జెట్ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. నెలల తరబడి జీఎస్టీ రిటర్నులు దాఖలు చేయడంలో విఫలమైనందుకు గాను వస్తు సేవల పన్ను (జీఎస్టీ) శాఖ ఆ సంస్థకు రూ. 124.65 కోట్ల పన్ను డిమాండ్ నోటీసు జారీ చేసింది. అంతేగాక పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తున్నందున కంపెనీ జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ను ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలంటూ షోకాజ్ నోటీసు కూడా ఇచ్చింది. నిర్దేశిత గడువులోగా స్పైస్‌జెట్ రిటర్నులు దాఖలు చేయకపోవడంతో జీఎస్టీ చట్టంలోని సెక్షన్-62 కింద అధికారులు ప్రొవిజనల్ అసెస్‌మెంట్ నిర్వహించి ఈ పన్ను డిమాండ్‌ను ఖరారు చేశారు. నవంబర్ నెలకు రూ. 44.44 కోట్లు, డిసెంబర్‌కు రూ. 43.79 కోట్లు, జనవరికి రూ. 12.19 కోట్లు, ఫిబ్రవరికి రూ. 12.10 కోట్లు, మార్చి నెలకు రూ. 12.12 కోట్ల చొప్పున బకాయిలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ రద్దుకు సంబంధించి ఈ నెల 25న షోకాజ్ నోటీసు జారీ చేసినప్పటికీ, సంస్థ నుంచి ఇంకా పూర్తిస్థాయి స్పందన రాలేదని తెలుస్తోంది. "పెండింగ్‌లో ఉన్న రిటర్నులను స్పైస్‌జెట్ వెంటనే దాఖలు చేసి, చట్టపరమైన నిబంధనలు పాటించకపోతే, కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఓ అధికారి స్పష్టం చేశారు. కాగా, స్పైస్‌జెట్ ఇప్పటికే తీవ్ర నష్టాల్లో కొనసాగుతోంది. 2025 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.621 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. నిన్నటి ట్రేడింగ్‌లో బీఎస్ఈలో స్పైస్‌జెట్ షేరు ధర 0.47 శాతం తగ్గి రూ.12.75 వద్ద ముగిసింది.

# దేశంలో భారీ ఉగ్ర కుట్రకు ప్లాన్

**9 మందిని అరెస్టు చేసిన ఢిల్లీ పోలీసులు**

**నిందితులకు ఐఎస్ఐ, దావూద్ ఇబ్రహీంతో సంబంధాలు**

న్యూఢిల్లీ: దేశంలో భారీ ఉగ్రవాద కుట్రను ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్ భగ్నం చేసింది. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ తోనూ, పరారీలో ఉన్న గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీంతోనూ సంబంధాలున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఢిల్లీ, ముంబై సహా దేశంలోని పలు ప్రాంతాల్లో విధ్వంసం సృష్టించేందుకు వీరు పథకం రచించినట్లు తెలిపారు. దేశంలోని అణు కేంద్రాలు, విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, విద్యుత్ ప్లాంట్లు, భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దాడులకు ప్లాన్ చేసినట్లు అధికారులు గుర్తించారని తెలుస్తోంది. అరెస్టయిన వారిలో ఢిల్లీ, ముంబై, పంజాబ్‌కు చెందినవారితో పాటు కొందరు విదేశీయులు కూడా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి భారీ ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. గత కొంతకాలంగా ఈ ముఠాపై నిఘా పెట్టిన పోలీసులు, సరైన సమయంలో వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఉగ్ర ముఠాకు సరిహద్దు ఆవల నుంచి అందుతున్న సహకారం, నిధుల సమీకరణ, విదేశీ హ్యాండ్లర్ల పాత్రపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల ఉగ్రవాద దాడుల హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీలో హై అలర్ట్ కొనసాగుతోంది.




# భవిష్యత్తు యుద్ధాలు ఏఐతోనే

**ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది**



పుణే: ఆధునిక యుద్ధ క్షేత్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రాముఖ్యత రోజురోజుకు పెరుగుతోందని, వేగంగా నిర్ణయాలు తీసుకోవడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోందని భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. మారుతున్న యుద్ధ తంత్రంలో వస్తున్న సంక్లిష్టతలను అధిగమించేందుకు కొత్త టెక్నాలజీలు తప్పనిసరిగా అవసరం అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. శనివారం నాడు పుణేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)లో 150వ కోర్సు పాసింగ్ అవుట్ పరేడ్‌ను సమీక్షించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత యుద్ధ క్షేత్రాలు భారీ స్థాయిలో సమాచారాన్ని సృష్టిస్తున్నాయని, అనేక రకాల వనరులు ఇందులో భాగమవుతున్నాయని జనరల్ ద్వివేది వివరించారు. ఇటువంటి పరిస్థితుల్లో కమాండర్లు, సైనికులు వేగంగా సమాచారాన్ని విశ్లేషించి, తక్షణమే నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. "యుద్ధ వేగం ఎక్కువగా ఉన్నప్పుడు, వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు అదనపు సాంకేతిక మద్దతు అవసరం. ఇక్కడే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అవసరం ఏర్పడుతుంది. భారీ వనరులను ఒకేసారి నియంత్రించడం కష్టమైనప్పుడు ఏఐ సాయపడుతుంది" అని ఆయన తెలిపారు. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో 'అబ్జర్వ్, ఓరియెంట్, డిసైడ్, యాక్ట్' (ఓఓడీఏ) అనే సైకిల్ ఉంటుందని, సంక్లిష్ట పరిస్థితుల్లో దీనిని వేగవంతం చేసేందుకు ఏఐ టెక్నాలజీలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన వివరించారు. ముఖ్యంగా స్మాల్ లాంగ్వేజ్ మోడల్స్, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ వంటివి సమాచారాన్ని వేగంగా ప్రాసెస్ చేయడానికి, వనరులను సమర్థవంతంగా కేటాయించడానికి దోహదపడతాయని అన్నారు. ఇదే సమయంలో సైనిక కార్యకలాపాల్లో డ్రోన్ల పాత్ర కూడా గణనీయంగా పెరిగిందని జనరల్ ద్వివేది హైలైట్ చేశారు. "ప్రస్తుత వాతావరణంలో, శత్రువుల నుంచి డ్రోన్ల ముప్పు అధికంగా ఉంది. వాటిని ఎదుర్కోవడానికి మనకు కౌంటర్-డ్రోన్ వ్యవస్థలు అవసరం. అదే సమయంలో, మన డ్రోన్లను కూడా సమర్థంగా ఉపయోగించుకోవాలి. యుద్ధ క్షేత్రంలో వనరులు భారీగా పెరిగిపోయాయి" అని ఆయన పేర్కొన్నారు. డ్రోన్లు, సెన్సార్లు, నిఘా పరికరాలు వంటి వాటిని సమర్థంగా నిర్వహించడానికి ఆటోమేషన్ తప్పనిసరి అని, ఇందుకు ఏఐ కీలకమైన సాధనంగా నిలుస్తుందని జనరల్ ద్వివేది అభిప్రాయపడ్డారు.

# అభిషేక్ బెనర్జీపై గుడ్ల దాడి



కోల్‌కతా: మమత బెనర్జీ మేనల్లుడు, టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీపై దాడి జరిగింది. ఎన్నికల అనంతర హింసాకాండ బాధిత కుటుంబాలను పరామర్శించడానికి వెళ్లిన ఆయనపై కోడిగుడ్లు, రాళ్లు విసిరారు. 'దొంగ దొంగ' అంటూ స్థానిక బీజేపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. శనివారం సోనార్‌పూర్ ప్రాంతాన్ని అభిషేక్ బెనర్జీ సందర్శించారు. ఎన్నికల అనంతర హింసాకాండ బాధితుల కుటుంబాలను పరామర్శించేందుకు అక్కడకు చేరుకున్నారు. కాగా, స్థానికులైన బీజేపీ కార్యకర్తలు అభిషేక్ బెనర్జీని అడ్డుకున్నారు. ఆయనపై కోడిగుడ్లు, రాళ్లు విసిరారు. 'దొంగ దొంగ' అంటూ ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ నేపథ్యంలో అభిషేక్ బెనర్జీ హెల్మెట్ ధరించగా, సెక్యూరిటీ సిబ్బంది ఆయనకు రక్షణగా నిలిచారు. మరోవైపు తనపై జరిగిన దాడికి బీజేపీనే కారణమని అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. 'ఇదంతా బీజేపీ ప్రాయోజితం. వాళ్లు ఏం చేశారో చూడండి. వాళ్ల ప్రజాస్వామ్యానికి ఉదాహరణ ఇదేనా. నెల కూడా కాలేదు. పోలీసులు ఎక్కడా కనిపించడం లేదు' అని విమర్శించారు.

**బీజేపీపై మమతా బెనర్జీ ఆగ్రహం**

ఈ ఘటనకు బీజేపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని టీఎంసీ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా ఆరోపించారు. శనివారం సాయంత్రం మమతా బెనర్జీ సోషల్ మీడియాలో స్పందిస్తూ, "పాలకులు హంతకులుగా మారారు. బీజేపీ సిగ్గుపడాలి" అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. అభిషేక్ బెనర్జీపై జరిగిన దాడికి సంబంధించిన వీడియోను కూడా ఆమె తన పోస్టులో పంచుకున్నారు. ఎన్నికల హింసలో ప్రాణాలు కోల్పోయిన సంజూ కర్మాకర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన అభిషేక్‌పై బీజేపీ మద్దతు ఉన్న దుండగులు దాడికి పాల్పడ్డారని టీఎంసీ ఆరోపించింది. ఈ దాడిని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష నేతకు ఉద్దేశపూర్వకంగానే సరైన పోలీస్ భద్రత కల్పించలేదని, ఇది బీజేపీ ప్రతీకార రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. ప్రతిపక్ష నేతలకు భద్రత కల్పించాలని, ఇలాంటి దాడులను నివారించాలని ఆయన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

# ఇండియా 'పవర్ ఫుల్' కంట్రీ

**అమెరికా రక్షణ మంత్రి హెగ్సెత్**



సింగపూర్: ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ ఒక 'శక్తివంతమైన దేశం' అని, ప్రాంతీయ బలాల సమతుల్యతకు కీలకమైన శక్తిగా నిలుస్తోందని అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ ప్రశంసించారు. సింగపూర్‌లో శనివారం జరిగిన 'షాంగ్రి-లా డైలాగ్' సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆసియాలోనే అతిపెద్ద రక్షణ, భద్రతా వేదిక అయిన ఈ సదస్సులో హెగ్సెత్ మాట్లాడుతూ, భారత్ తన సైన్యాన్ని వేగంగా ఆధునికీకరించుకుంటోందని అన్నారు. "ఉన్నత స్థాయి సైనిక కార్యకలాపాలను నిర్వహించేందుకు భారత్ భారీ పారిశ్రామిక, లాజిస్టిక్స్ సామర్థ్యాలను నిర్మించుకుంటోంది. దక్షిణాసియాలో, ప్రాంతీయ సమతుల్యతను కాపాడటంలో భారత్ ఒక కీలక శక్తి. శక్తివంతమైన భారత్ తన సొంత ప్రయోజనాల కోసం పనిచేయడంతో పాటు, ఈ ప్రాంతంలో బలాల సమతుల్యతను కాపాడాలనే మా ఉమ్మడి లక్ష్యాన్ని ముందుకు తీసుకెళుతోంది" అని ఆయన స్పష్టం చేశారు. అమెరికా-భారత్ మధ్య పెరుగుతున్న రక్షణ సహకారాన్ని, ముఖ్యంగా సైనిక సామర్థ్యాలను పెంచేందుకు ఉద్దేశించిన సంయుక్త కార్యక్రమాలను ఆయన కొనియాడారు. ఈ ప్రాంతంలో చైనా సైనిక విస్తరణపై ఆందోళన వ్యక్తం చేసిన హెగ్సెత్, మిత్రదేశాలు భద్రతా బాధ్యతల్లో మరింత పాలుపంచుకోవాలని, రక్షణ వ్యయాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. కొన్ని దేశాలు తమ జీడీపీలో 3.5 శాతం రక్షణకు కేటాయించాలని ఆయన సూచించారు. ఇరాన్ వంటి ఇతర అంతర్జాతీయ అంశాలపై దృష్టి సారించినప్పటికీ, ఇండో-పసిఫిక్ ప్రాంతంపై అమెరికాకు ఉన్న ప్రాధాన్యం తగ్గలేదని ఆయన స్పష్టం చేశారు. 2025లో భారత్-అమెరికా దేశాల మధ్య కుదిరిన పదేళ్ల రక్షణ ఒప్పందం పునాదిగా ఈ సహకారం మరింత బలపడుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# లిప్‌స్టిక్, పౌడర్లు అమ్ముకుంటున్న చైనా మీడియా

బీజింగ్: చైనాలో ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉన్నట్టు చెప్పడానికి ఆ దేశ ప్రభుత్వ మీడియా సంస్థల ప్రస్తుత పరిస్థితే నిదర్శనంగా నిలుస్తోంది. చైనా కమ్యూనిస్ట్ పార్టీకి ప్రచార సాధనంగా ఉన్న అధికారిక బ్రాడ్‌కాస్టర్ 'చైనా సెంట్రల్ టెలివిజన్' ఇప్పుడు మనుగడ కోసం లైవ్‌స్ట్రీమ్ ఈ-కామర్స్‌లోకి అడుగుపెట్టింది. చైనా ఆర్థిక వ్యవస్థ ఎంత ప్రమాదకరమైన దశలో ఉందో ఈ పరిణామం స్పష్టం చేస్తోందని 'యురేషియా రివ్యూ' తన నివేదికలో వెల్లడించింది. దశాబ్దాలుగా ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన సీసీటీవీ, ఇప్పుడు చైనా టిక్‌టాక్‌గా పేరొందిన 'డౌయిన్' ప్లాట్‌ఫామ్‌లో చర్మ సౌందర్య ఉత్పత్తులు, టీ, పుస్తకాలు, బరువు తగ్గించే కిట్లు అమ్ముతోందని నివేదిక వివరించింది. ప్రభుత్వ మీడియా సంస్థ ఇప్పుడు షాపింగ్ మాల్‌గా మారిందని వ్యాఖ్యానించింది. చైనాలో జర్నలిజానికి స్వర్ణయుగం ముగిసిందని, ప్రకటనల ఆదాయం పూర్తిగా పడిపోవడంతో సీసీటీవీ వంటి సంస్థలు తమ పాప్యులారిటీని అమ్ముకోవాల్సి వస్తోందని పేర్కొంది. సీసీటీవీ మాత్రమే కాకుండా జిన్హువా న్యూస్ ఏజెన్సీ, చైనా పోస్ట్, చైనా రైల్వే వంటి ప్రభుత్వ రంగ సంస్థలు కూడా ఈ-కామర్స్‌లోకి ప్రవేశించాయి. ప్రభుత్వ మద్దతు ఉన్న సంస్థల గుత్తాధిపత్యం వల్ల చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఫ్యాక్టరీలు మూతపడటం, వందల కౌంటీలలో ఉద్యోగుల తొలగింపు వంటి పరిణామాలు చైనా ఆర్థిక కష్టాలను కళ్లకు కడుతున్నాయి.

# ట్రంప్ గట్టిగనే ఉన్నడు!

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై శ్వేతసౌధం కీలకమైన నివేదికను విడుదల చేసింది. ట్రంప్ 'అద్భుతమైన ఆరోగ్యంతో' ఉన్నారని, కమాండర్ ఇన్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తించడానికి 'పూర్తిగా ఫిట్'గా ఉన్నారని ఆ నివేదిక స్పష్టం చేసింది. మంగళవారం వాల్టర్ రీడ్ నేషనల్ మిలిటరీ మెడికల్ సెంటర్‌లో ట్రంప్‌కు వైద్య పరీక్షలు నిర్వహించగా, ఆయన వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ సీన్ బార్బబెల్లా ఈ నివేదికను నిన్న విడుదల చేశారు. పరీక్షల అనంతరం ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో స్పందిస్తూ, ప్రతి ఆరు నెలలకు జరిగే తన సాధారణ వైద్య పరీక్షలు పూర్తయ్యాయని, అన్నీ పర్ఫెక్ట్‌గా ఉన్నాయని పేర్కొన్నారు. వైద్య సేవలు అందించిన డాక్టర్లు, సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సమగ్ర వైద్య పరీక్షల్లో భాగంగా 22 మంది నిపుణులు సీటీ స్కాన్, క్యాన్సర్ స్క్రీనింగ్‌లతో పాటు ఇతర పలు పరీక్షలు నిర్వహించినట్లు నివేదికలో పేర్కొన్నారు.

# విశ్వగురుకు పరీక్షలు పెట్టొస్తలే!

**సీయూఈటీ యూజీ 2026 పరీక్షలో సాంకేతిక లోపం**

**పలు కేంద్రాల్లో రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభం**

**విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారంటూ రాహుల్ ఫైర్**



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో ఇవాళ కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ యూజీ) 2026 పరీక్షలో సాంకేతిక లోపం తలెత్తింది. దీనివల్ల రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సమస్యను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ధృవీకరించింది. ఇంతకుముందు నీట్ (యూజీ) పరీక్ష లీకైంది. ఈ నేపథ్యంలో లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. దేశాన్ని విశ్వగురువుగా మారుస్తున్నామని ప్రధాని చెబుతుంటారని, కానీ కనీసం ఒక్క పరీక్షను కూడా సజావుగా నిర్వహించడం లేదని విమర్శించారు. సర్వర్ లోపం కారణంగా కొన్ని పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన పరీక్షను సాయంత్రం 4 గంటలకు ప్రారంభించారు. విద్యార్థులను మధ్యాహ్నం 2:30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించారు. సాంకేతిక సమస్యను పరిష్కరించామని, పరీక్ష సమయం కోల్పోయిన విద్యార్థులకు నష్టపరిహారంగా అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో జరిగిన ఇతర పరీక్షల వైఫల్యాలను ప్రస్తావిస్తూ, "నీట్, సీబీఎస్ఈ, ఎస్సెస్సీ, ఈరోజు సీయూఈటీ. నాలుగు పరీక్షలు. కోటి మంది విద్యార్థులు. కానీ ఒక్కదాన్నీ నిజాయితీగా నిర్వహించలేకపోయారు" అని ఆయన ఆరోపించారు. భారత్‌ను 'విశ్వగురువు'గా మారుస్తున్నామని చెబుతూనే, మరోవైపు ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని రాహుల్ మండిపడ్డారు. దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న జాతీయస్థాయి పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలు, పారదర్శకత లోపంపై ఈ ఘటన మరోసారి ఆందోళనలను రేకెత్తించింది.

# వియత్నాంతో బ్రహ్మోస్ ఒప్పందం

**రూ.6,000 కోట్ల విలువైన డీల్..**

**తుది దశలో ఇండోనేషియా ఒప్పందం**




సింగపూర్: వియత్నాంతో బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి ఒప్పందం ఇప్పటికే కుదిరిందని, ఇండోనేషియాతో ఒప్పందం తుది దశలో ఉందని సింగపూర్‌లో పర్యటిస్తోన్న భారత రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ శనివారం కీలక ప్రకటన చేశారు. షాంగ్రిలా డైలాగ్ ముగింపు సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వియత్నాం ప్రతినిధి అడిగిన ప్రశ్నకు సింగ్ స్పందిస్తూ.. "నాకున్న అవగాహన ప్రకారం ఇండోనేషియా, వియత్నాం రెండింటితోనూ ఒప్పందాలు చివరి దశకు చేరుకున్నాయి. వాస్తవానికి వియత్నాంతో ఒప్పందం ఇప్పటికే పూర్తయింది. బహుశా దీనిని ఇంకా అధికారికంగా ప్రకటించకపోవచ్చు.. కానీ సంతకాలు మాత్రం జరిగిపోయాయి" అని అన్నారు. శిక్షణ, లాజిస్టికల్ మద్దతుతో కలిపి వియత్నాంతో జరిగిన ఈ ఒప్పందం విలువ సుమారు 6,000 కోట్లు (₹629 మిలియన్లు) ఉంటుందని నివేదికలు చెబుతున్నాయి. భారత్-రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ సూపర్‌సోనిక్ క్షిపణిని కొనుగోలు చేసిన మొదటి దేశం ఫిలిప్పీన్స్ అన్న ఆయన.. ఆసియాన్ కూటమి పట్ల భారత్‌కు బలమైన నిబద్ధత ఉందని స్పష్టం చేశారు. ఫిలిప్పీన్స్‌కు బ్రహ్మోస్ క్షిపణుల మొదటి బ్యాచ్‌ను 2024లో.. రెండో బ్యాచ్‌ను 2025 ఏప్రిల్‌లో అందజేశారు. అధునాతన క్షిపణి సాంకేతికతలను పంచుకునే విస్తృతమైన అంశాన్ని ప్రస్తావిస్తూ... ఆసియాన్ కూటమితో భారతదేశానికి బలమైన అనుబంధం ఉందని సింగ్ వివరించా. "మేము మీ అందరినీ 'స్నేహపూర్వక దేశాలు'గా భావిస్తాం.. మీతో మా అధునాతన రక్షణ సాంకేతికతలను పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నాం" అని ఆయన అన్నారు.

# గౌడ కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి

## కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ వినతి



జగిత్యాల బ్యూరో, మే 30 (ఈవార్తలు): కోరుట్ల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదాల కారణంగా భారీగా దగ్ధమైన ఈత వనాల సమస్యపై కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గురువారం జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్, పెద్దాపూర్, కొనరావుపేట, కోరుట్ల మండలం సంగెం, ఐలాపూర్, మాధాపూర్, చిన్నమెట్‌పల్లి, మోహన్‌రావుపేట్, కోరుట్ల పట్టణ పరిధి, ఇబ్రహీంపట్నం మండలం ఫకీర్‌కొండాపూర్ తదితర గ్రామాల్లో తీవ్ర ఎండల కారణంగా సంభవించిన అగ్నిప్రమాదాల్లో సుమారు 18,100 ఈత చెట్లు దగ్ధమయ్యాయని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఘటనలతో వందలాది గౌడ కుటుంబాలు జీవనాధారాన్ని కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున తక్షణ ఆర్థిక సాయం అందించడంతో పాటు రెవెన్యూ, ఎక్సైజ్ శాఖల ద్వారా వెంటనే నష్ట అంచనా సర్వే నిర్వహించి తగిన పరిహారం మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా అగ్నిప్రమాదాలు సంభవించిన గ్రామాల్లో ఈత వనాల వద్ద ప్రత్యేకంగా వాటర్ బోర్లు మంజూరు చేసి నీటి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# రాజ్యాంగ హక్కులను ఉపయోగించుకోవాలి

**ఎండపల్లి మండల ఆర్ఐ తోడేటి అన్వేష్**



ఎండపల్లి, మే 30 (ఈవార్తలు): భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలని ఎండపల్లి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తోడేటి అన్వేష్ అన్నారు. శనివారం మండలంలోని ముంజంపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పౌర హక్కులు, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ విలువలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సమాజంలో ఇంకా మిగిలి ఉన్న అంటరానితనాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ స్ఫూర్తిని ఆచరణలో పెట్టినప్పుడే సమానత్వ సమాజం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం గ్రామ ప్రజలతో కలిసి అంటరానితన నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ముంజంపల్లి గ్రామ సర్పంచ్ సింగిరెడ్డి లింగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణాధికారి బలిజపల్లి సందీప్, ఉపాధి హామీ ఏపీవో అనిల్ కుమార్, ఎండపల్లి ఎస్సీ హాస్టల్ వార్డెన్ అఫ్జల్, ఎంఆర్సీ డి. రాజారాణి, బసంత్‌నగర్ పోలీస్ హెడ్ కానిస్టేబుల్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంబేడ్కర్ సంఘం నాయకుడు చొప్పదండి బుచ్చిలింగం, ఉపాధి హామీ కూలీలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ మాట.. అంగన్వాడీ బాట

**జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి**



జగిత్యాల, మే 30 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల "ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక" మహిళా ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహిస్తున్న "అమ్మ మాట--అంగన్‌వాడీ బాట" ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఖిల్లాగడ్డ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో 100 శాతం చిన్నారుల నమోదు చేపట్టాలని సూచించారు. కేంద్రాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వ అంగన్‌వాడీలు ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోవని అన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్తగా చేరిన చిన్నారులకు విద్య ఆరంభ్ సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ జీనత్ పర్వీన్ మునీరుద్దీన్, కౌన్సిలర్లు అయూబ్ ఖాన్, కమలుద్దీన్, దుమాల రాజ్‌కుమార్, ఐసీడీఎస్ సీడీపీవో జయప్రద, ఏసీడీపీవో రాజశ్రీ, సూపర్‌వైజర్లు మమత, కవిత, స్వరూపరాణి, అంగన్‌వాడీ టీచర్లు, ప్రజలు పాల్గొన్నారు.



# జగిత్యాల నూతన కమిషనర్‌కు సన్మానం

జగిత్యాల, మే 30 (ఈవార్తలు): గ్రూప్-1 ద్వారా ఎంపికై జగిత్యాల మున్సిపాలిటీ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కే. సత్యప్రణవ్‌ను మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఘనంగా సన్మానించారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా సమావేశానికి హాజరైన ఆయనకు మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, మౌలిక వసతుల కల్పనలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. నూతన కమిషనర్ సత్యప్రణవ్‌కు అభినందనలు తెలియజేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో సమర్థవంతంగా పనిచేయాలని సభ్యులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో. కో ఆప్షన్ నెంబర్ అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, కౌన్సిలర్, దుమ్మల రాజకుమార్, రజియోద్దీన్, డాక్టర్ అయూబ్ ఖాన్, క్యాదాస్ నవీన్, శ్రీనివాస్, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

**కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి: కల్వకుంట్ల సంజయ్**

మెట్‌పల్లి, మే 30 (ఈవార్తలు): బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి ప్రతి కార్యకర్త, అభిమాని సభ్యత్వం పొందేలా కృషి చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మెట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కోరుట్ల నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి లోక బాపు రెడ్డి, జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు ప్రక్రియ, గ్రామ, బూత్ స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, ప్రజా సమస్యలపై కార్యాచరణ అంశాలపై నాయకులు సూచనలు చేశారు. యువత, మహిళలు, రైతులు పెద్ద సంఖ్యలో సభ్యత్వం పొందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. పార్టీ కార్యకర్తలే బీఆర్ఎస్‌కు వెన్నెముక అని పేర్కొంటూ, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, మే 30 (ఈవార్తలు): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామివారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. తెల్లవారుజామున కోనేరు లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే క్షేత్రపాలకుడైన శ్రీ బేతలస్వామి వారిని కూడా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి సుమారు 30 వేల మంది భక్తులు విచ్చేసినట్లు అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఉ ప ప్రధాన అర్చకులు రంగయ్య ముఖ్య అర్చక చిన్న మారుతి ,పెద్ద రాము ,పవన్ ,అభిలష్ లు భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ ఎస్ అంజనారెడ్డి భక్తులకు ఇలాంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించారు. ఏఈఓ హరిహర్నాథ్, సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, సునీల్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.





# మేరు సంఘం నూతన కమిటీకి అడువాల జ్యోతి అభినందనలు

జగిత్యాల టౌన్, మే 30 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని మేరు సేవా సంఘం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఆమె అభినందించారు. సంఘం మరింత అభివృద్ధి చెందేందుకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని హామీ ఇచ్చారు. సేవా కార్యక్రమాల ద్వారా సంఘం ప్రజల్లో మరింత గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు రాపర్తి వినోద్, ఉపాధ్యక్షుడు రాగిళ్ల నారాయణ, ప్రధాన కార్యదర్శి గట్ల శ్రీనివాస్, కోశాధికారి గట్ల శ్రీకర్, సహాయ కార్యదర్శి రాగిళ్ల శ్రీధర్‌తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# మాజీ మంత్రి రాజేశం గౌడ్‌కు దావ వసంత పరామర్శ

జగిత్యాల, మే 30 (ఈవార్తలు): ఇటీవల మోకాలి శస్త్రచికిత్స చేయించుకున్న మాజీ మంత్రి గొడిసెల రాజేశం గౌడ్‌ను శనివారం జగిత్యాల మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాజేశం గౌడ్ శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తవడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన ఆమె, వైద్యుల సూచనలు పాటిస్తూ విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ప్రజా జీవితంలో ఆయన మరింత చురుకుగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జి.ఆర్. దేశాయి తదితరులు పాల్గొని మాజీ మంత్రిని పరామర్శించారు.

# ఉర్దూలో మున్సిపల్ ఎజెండా

జగిత్యాల టౌన్, మే 30 (ఈవార్తలు): జగిత్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల ఎజెండా కాపీని ఉర్దూ భాషలో కూడా ప్రచురించాలన్న ఎంఐఎం కౌన్సిలర్ల విజ్ఞప్తికి ఫలితం దక్కింది. గత నెల జరిగిన మున్సిపల్ సమావేశంలో ఎంఐఎం కౌన్సిలర్లు మహ్మద్ రజియుద్దీన్, డాక్టర్ మహ్మద్ అయూబ్ ఖాన్‌లు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి ఎజెండా కాపీని ఉర్దూ భాషలో కూడా అందుబాటులో ఉంచాలని కోరారు. వారి ప్రతినిధిత్వానికి స్పందించిన మున్సిపల్ అధికారులు ఈ నెల కౌన్సిల్ సమావేశం కోసం ఎజెండా కాపీని ఉర్దూ భాషలో ముద్రించి ముస్లిం కౌన్సిలర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఐఎం కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉర్దూ భాషకు ప్రాధాన్యత కల్పించడం ద్వారా ప్రజాప్రతినిధులకు సమావేశాల అంశాలపై మరింత స్పష్టత లభిస్తుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం ఉర్దూ భాషాభిమానులకు ఆనందాన్ని కలిగించిందన్నారు.

# ఖాళీ కుర్చీతో ఎమ్మెల్యేకు బీజేపీ సవాల్

జగిత్యాల టౌన్, మే 30 (ఈవార్తలు): జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌పై చేసిన అవినీతి ఆరోపణలపై బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నేపథ్యంలో బీజేపీ నేత బోగా శ్రావణి నివాసంలో ఉన్న పలువురు పార్టీ కార్యకర్తలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఎమ్మెల్యే అవినీతిపై ప్రజల ముందే చర్చ జరగాలని కోరుతూ బీజేపీ కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పోస్టర్లు అంటించి సవాల్ విసిరారు. ఉదయం 11 గంటలకు తహసీల్ చౌరస్తా వద్ద బహిరంగ చర్చకు హాజరుకావాలని ఎమ్మెల్యేకు పిలుపునిచ్చారు. అయితే తహసీల్ చౌరస్తాకు వెళ్లేందుకు ప్రయత్నించిన బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం బీజేపీ నేతలు కుర్చీపై ఎమ్మెల్యే పేరుతో స్టిక్కర్ అతికించి ఖాళీ కుర్చీని ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. అవినీతి ఆరోపణలపై ప్రజల సమక్షంలో చర్చకు రావాలని ఎమ్మెల్యేను మరోసారి డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు బోగ శ్రావణి పరామర్శ

జగిత్యాల టౌన్, మే 30 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన పలువురు కుటుంబాల సభ్యులను బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బోగ శ్రావణి శనివారం స్వగృహాలకు వెళ్లి పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ఆత్మీయులను కోల్పోవడం తీరని లోటేనని పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని సూచించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, బాధిత కుటుంబాలకు పార్టీ తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్, ఆముదరాజు, మ్యాదరి అశోక్, సుంకేట దశరథ్ రెడ్డి, గదాసు రాజేందర్, మర్రిపల్లి సాగర్, కాశెట్టి తిరుపతి, సిరిపురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# కేటీఆర్‌కు ఆటా ఆహ్వానం

**తెలుగు మహాసభలకు పిలుపు**

హైదరాబాద్, మే 30 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , మాజీ మంత్రి కేటీఆర్‌ను అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా ) బృందం కలిసింది. 2026 జూలై 31, ఆగస్టు 1, 2వ తేదీల్లో అమెరికా మేరీల్యాండ్‌లో నిర్వహించనున్న 19వ అమెరికన్ తెలుగు అసోసియేషన్ తెలుగు మహాసభలకు హాజరుకావాల్సిందిగా అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఆహ్వానించింది. ఆటా అధ్యక్షుడు జయంత్ చల్లా, ఆటా కాన్ఫరెన్స్ నేషనల్ కోఆర్డినేటర్ శరత్ వేముల ఆటా సభల సందర్భంగా చేపట్టే కార్యక్రమాలను కేటీఆర్‌కు వివరించారు. ఈ సందర్భంగా అమెరికాలోని భారతీయుల పరిస్థితులు, రాజకీయాలపై చర్చించారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో అమెరికన్ తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు జయంత్ చల్లా, నేషనల్ కోఆర్డినేటర్ శరత్ వేముల, కాన్ఫరెన్స్ కోఆర్డినేటర్ తిరుమల రెడ్డి, ఈశ్వర్ రెడ్డి బండా పాల్గొన్నారు. ఆటా మహా సభలకు హాజరయ్యేందుకు కేటీఆర్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నారైల పాత్ర , తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్ కార్యక్రమాలపై కేటీఆర్ చర్చించారు. అప్పటి టీడీఎఫ్ చైర్మన్ మధు రెడ్డి నల్లగొండ ఫ్లోరైడ్ పోరాటంలో మద్దతు ఇచ్చిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేసుకున్నారు.



# బక్కని నర్సింహులు వ్యాఖ్యలు తప్పే

**మాట్లాడేప్పుడు జాగ్రత్త**

**ఏపీ సీఎం చంద్రబాబునాయుడు**

విజయవాడ, మే 30 (ఈవార్తలు): తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు బక్కని నర్సింహులు చేసిన వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధినేత చంద్రబాబు తప్పుపట్టారు. చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు నేతలు సంయమనం పాటించాలని, ఎవరి మనోభావాలను దెబ్బతీయకూడదని ఆయన హితవు పలికారు. "తెలంగాణ అనే పదం నిఘంటువులోనే లేదు" అంటూ బక్కని ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో చంద్రబాబు ఈ స్పష్టత ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ పుట్టిందే తెలంగాణ గడ్డపై అని గుర్తుచేశారు. తెలుగు జాతి ఒక్కటేనని, తెలంగాణలో పార్టీకి బలమైన క్యాడర్ ఉందని స్పష్టం చేశారు. అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో మీడియా ప్రతినిధులతో జరిగిన చిట్ చాట్ లో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఆయన కుమార్తె సునీత చేస్తున్న పోరాటానికి చంద్రబాబు మద్దతు తెలిపారు. తన తండ్రిని ఎవరు చంపారో తెలుసుకునే హక్కు ఆమెకు ఉందని, ఆమె పోరాటం వల్లే ఈ కేసు ఇంకా సజీవంగా ఉందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లుపై కేంద్ర ప్రభుత్వం పట్టుదలగా ఉందని, అవి దేశ రాజకీయాల్లో పెనుమార్పులు తెస్తాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పునర్విభజనలో రాష్ట్రానికి నష్టం జరగకుండా ప్రస్తుతమున్న స్థానాలను 50 శాతం పెంచితే మేలు జరుగుతుందని సూచించారు.

వయ్యారి చిత్రం


దేబాస్మిత బసు



# ట్రోలింగ్స్ నా కంట్రోల్‌లో లేవు

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కలయికలో వస్తున్న 'పెద్ది' సినిమా జూన్ 4న విడుదల కానుండగా.. ప్రమోషన్స్‌లో జోరు పెంచారు చిత్ర బృందం. ఇందులో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రామ్ చరణ్ తనపై వస్తున్న ట్రోల్స్‌పై స్పందించాడు. 'ట్రోలింగ్స్‌పై నాకు ఎలాంటి అభిప్రాయం లేదు. నా కంట్రోల్‌లో లేని దాని గురించి నేనేం మాట్లాడగలను. అదుపు చేయలేని విషయాలపై నేను స్పందించను. ఒక్కటి మాత్రం చెప్పగలను. మేం తీసే సినిమా అందరికీ నచ్చాలని లేదు.. కానీ మా శ్రమను గుర్తిస్తారని ఆశిస్తున్నాం. అంతే కాదు.. పెద్ది సినిమా నా కెరీర్ బెస్ట్ మూవీ అవుతుందనే నమ్మకం ఉంది' అంటూ ధీమా వ్యక్తం చేశాడు.

# పెద్ది టికెట్ రేట్ల పెంపుకు ఏపీ గ్రీన్ సిగ్నల్




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'పెద్ది' టికెట్ ధరల పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ.. విడుదలైన మొదటి వారం లేదా పది రోజులు అదనపు ధరలతో పాటు రోజుకు 5 ఆటలు ప్రదర్శించుకునేందుకు అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 3వ తేదీ రాత్రి ప్రదర్శించే ప్రత్యేక ప్రీమియర్ షో టికెట్ ధరను +టాతో కలిపి రూ. 600గా నిర్ణయించారు. ఆ తర్వాత సాధారణ రోజుల్లో సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ ధరపై రూ. 100, అలాగే మల్టీప్లెక్స్‌లలో రూ. 125 చొప్పున అదనంగా పెంచుకునేందుకు ఏపీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే.. తెలంగాణలో మాత్రం 'పెద్ది' చిత్రానికి టికెట్ ధరల పెంపు ఉండకపోవచ్చని తెలుస్తోంది. రేట్ల పెంపుదలపై కోర్టులో దాఖలైన పిటిషన్ విచారణ ఆలస్యం అవుతుండటంతోఈ సినిమా విడుదలకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో చిత్ర యూనిట్ తమ పిటిషన్‌ను ఉపసంహరించుకుంది. దీనివల్ల నైజాం ప్రాంతంలో ఈ సినిమా సాధారణ ప్రభుత్వ ధరలతోనే విడుదల కానున్నట్లుగా సమాచారం.



# రణ్‌వీర్‌కు ఆర్జీవీ సపోర్ట్

డాన్ 3 వివాదంపై సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ (ఆర్జీవీ) తనదైన శైలిలో స్పందించారు. -డాన్ 3- చిత్రానికి సంబంధించి రణ్‌వీర్ సింగ్‌కు ఆయన పూర్తి మద్దతు ప్రకటించారు. ఒక సినిమాకు ఎవరిని ఎంపిక చేసుకోవాలనేది పూర్తిగా దర్శకుడు ఫర్హాన్ అఖ్తర్ వ్యక్తిగత, వృత్తిపరమైన నిర్ణయమని ఇందులో మూడో వ్యక్తి జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని ఆర్జీవీ అభిప్రాయపడ్డారు. ఇదే క్రమంలో ఆర్జీవీ సినిమా పరిశ్రమలోని కార్మిక సంఘాలపై, ఎఫ్‌డబ్ల్యూఐఎ ఈ వంటి సంస్థలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కొన్ని సందర్భాల్లో ఇలాంటి సంఘాలు చిత్ర నిర్మాణ స్వేచ్ఛను హరిస్తున్నాయని.. అవసరమైతే వాటిపై నిషేధం విధించాలనే డిమాండ్‌ను కూడా తెరపైకి తెచ్చారు. కళాకారులు, దర్శకుల హక్కులను అణచివేసేలా యూనియన్ల తీరు ఉండకూడదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో చిత్రనిర్మాతలు ఎదుర్కొంటున్న సవాళ్లు బడ్జెట్ లేదా కథకు మాత్రమే పరిమితం కావడం లేదు. సోషల్ మీడియా ట్రోలింగ్ .. పరిశ్రమలోని అంతర్గత రాజకీయాలు దర్శకుల ఆలోచనలకు అడ్డుకట్ట వేస్తున్నాయి. ఫర్హాన్ అఖ్తర్ వంటి ప్రతిభావంతుడైన దర్శకుడు కొత్త ప్రయోగానికి పూనుకున్నప్పుడు అతనికి మద్దతు ఇవ్వాల్సింది పోయి అడ్డంకులు సృష్టించడం సరికాదనే చర్చ పరిశ్రమ వర్గాల్లో నడుస్తోంది.



# బూతు కామెంట్లు గుచ్చుకున్నాయ్

ఇన్‌స్టాగ్రామ్ సబ్‌స్క్రిప్షన్ ఫీచర్ ద్వారా బోల్డ్ కంటెంట్ చూడటానికి నెలకు రూ. 299 వసూలు చేసే సరికొత్త ట్రెండ్ నడుస్తోంది. ఇప్పుడు ఇదే బాటలో కోలీవుడ్ స్టార్ నటుడు కృష్ణ కుమార్ కూతురు, ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ హన్సిక కృష్ణ కూడా తన సబ్‌స్క్రిప్షన్ ధరను రూ. 399కి పెంచుతూ ఒక బోల్డ్ వీడియోను విడుదల చేసింది. ఈ వీడియో కాస్తా సోషల్ మీడియాలో సంచలనంగా మారడంతో.. "డబ్బు కోసం ఇంత దిగజారాలా?" అంటూ నెటిజన్లు ఆమెపై దారుణంగా విమర్శలు గుప్పించారు. ఇక ఈ వివాదంపై హన్సిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందిస్తూ ఓ ఎమోషనల్ నోట్ షేర్ చేసింది. బుద్ధిలేక ఆ వీడియోను పోస్ట్ చేశానని, అందుకు తనను క్షమించాలని కోరింది. అసలు ఆ వీడియోను ఎందుకు పోస్ట్ చేశానో తనకే అర్థం కావడం లేదని, తన వల్ల పెద్ద తప్పు జరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. తాను వెంటనే ఆ వీడియోను డిలీట్ చేసినప్పటికీ, కొందరు దాన్ని రికార్డ్ చేసి సోషల్.. మీడియాలో వైరల్ చేశారని తెలిపింది. తాను డబ్బు కోసం, పబ్లిసిటీ కోసమే ఇలా చేశానని దారుణంగా మాట్లాడుతున్నారని, కానీ తనకు అలాంటి ఉద్దేశం లేదని స్పష్టం చేసింది.

# జూన్ 7న చియాన్ 63 స్టార్ట్

కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్.. ఇప్పుడు తన 63వ చిత్రం కోసం సిద్ధం అవుతున్నాడు. ఆనంద్ శంకర్ దర్శకత్వంలో సత్యజ్యోతి ఫిలిమ్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్‌కు సంబంధించిన అప్డేట్ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఈ మేరకు 'చియాన్ 63 షూటింగ్ జూన్ 7న పూజా కార్యక్రమంతో గ్రాండ్‌గా ప్రారంభం కానుంది. ఇంకెందుకు ఆలస్యం.. బాణసంచా పేల్చి సంబరాలు చేసుకోండి!' అంటూ ఓ పోస్టర్ వైరల్ అవుతుండగా.. ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఈ జూన్‌లో స్టార్ట్ అయ్యే మొదటి షెడ్యూల్ చెన్నై, దాని పరిసర ప్రాంతాలలో చిత్రీకరించనున్నారట. అంతే కాకుండా.. ఈ ప్రాజెక్టు కోసం చియాన్ విక్రమ్ సుమారు 50 నుండి 60 రోజుల కాల్ షీట్ 2ను కేటాయించినట్లు టాక్.





# నవ్వడం మర్చిపోయా: నేహాదుఫియా

నేహా ధూపియా.. తాజాగా తన కెరీర్ తొలి రోజుల్లో ఎదుర్కొన్న ఒక చేదు అనుభవాన్ని షేర్ చేస్తూ సంచలన వ్యాఖ్యలు చేసింది. తన వృత్తిపరమైన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసిన ఒక సంఘటన గురించి నేహా ధూపియా ఇటీవల ప్రముఖ నటి హుమా ఖురేషీతో జరిగిన ఒక ఇంటర్వ్యూలో సుదీర్ఘంగా మాట్లాడింది. సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన కొత్తలో ఒక ప్రముఖ కాస్టింగ్ డైరెక్టర్ తనను ఉద్దేశించి చేసిన కామెంట్ తన మనసుపై ఎంతటి బలమైన ముద్ర వేసిందో గుర్తుచేసుకుంది. ఆడిషన్స్ ఇచ్చే సమయంలో సదరు కాస్టింగ్ డైరెక్టర్ తన దగ్గరకు వచ్చి.. -నువ్వు ఆడిషన్స్ ఇచ్చేటప్పుడు అస్సలు నవ్వకు.. నీ నవ్వు చాలా బిగ్గరగా ఉంటుంది- అని నిర్మొహమాటంగా ముఖం మీదే చెప్పేశాడని నేహా ధూపియా అసలు నిజాన్ని బయటపెట్టింది. ఆ కాస్టింగ్ డైరెక్టర్ చేసిన వ్యాఖ్య ఇతరులకు చాలా చిన్న విషయంగా అనిపించవచ్చు కానీ.. ఒక నటిగా కెరీర్ బిల్డ్ చేసుకుంటున్న తనకు మాత్రం అది చాలా మానసిక వేదనను మిగిల్చిందని నేహా అంగీకరించింది. ఆ చిన్న విమర్శ తన వృత్తిపరమైన ప్రవర్తనను.. తనను తాను చూసుకునే విధానాన్ని పూర్తిగా మార్చేసిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విమర్శ ప్రభావం వల్ల తాను దాదాపు పదేళ్ల పాటు నవ్వడమే మర్చిపోయానని నేహా ధూపియా అత్యంత విచారకరమైన నిజాన్ని వెల్లడించింది.

# 2.5 కోట్ల పారితోషికం ఫేక్




ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన హాలీవుడ్ ఫాంటసీ డ్రామా సిరీస్ -గేమ్ ఆఫ్ థ్రోన్స్- సాధించిన విజయం ఎలాంటిదో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అయితే ఈ సిరీస్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు ఇందులో నటించిన ప్రధాన నటీనటులు ఎపిసోడ్‌కు ఏకంగా 3 లక్షల డాలర్లు (సుమారు 2.5 కోట్లకు పైగా) పారితోషికం తీసుకున్నారంటూ గత కొన్నేళ్లుగా ఇంటర్నెట్‌లో విపరీతంగా వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. తాజాగా ఈ లాంగ్-స్టాండింగ్ రూమర్లపై ఈ సిరీస్‌లో -మదర్ ఆఫ్ డ్రాగన్స్- డెనెరిస్ టార్గారియన్ పాత్ర పోషించిన ప్రముఖ నటి ఎమీలియా క్లార్క్ ఎట్టకేలకు స్పందించారు. ఈ ప్రచారంలో ఉన్న పారితోషికాల వెనుక ఉన్న అసలు నిజాన్ని బయటపెడుతూ నెట్టింట సాగుతున్న ఊహాగానాలకు తెరదించారు. ప్రఖ్యాత అంతర్జాతీయ పత్రిక -వెరైటీ-కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎమీలియా క్లార్క్ (39) మాట్లాడుతూ.. గత పదేళ్లకు పైగా ప్రచారంలో ఉన్న ఈ రెమ్యునరేషన్ వార్తలు పూర్తిగా అవాస్తవమని.. అవి చాలా అతిశయోక్తి మాటలు అని కొట్టి పారేసారు. మేము అంత పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించలేదు.. ఒకవేళ అది నిజమై ఉంటే.. నేను ఇప్పుడు కొన్ని పోర్షే కార్లలో తిరుగుతూ ఉండేదాన్ని.. ఒకసారి ఊహించుకోండి! అంటూ క్లార్క్ చాలా చమత్కారంగా సమాధానమిచ్చారు.



## ఆసియా గేమ్స్‌లో వైభవ్ ఎంట్రీ

ఈ ఏడాది జపాన్‌లో జరగనున్న ఆసియా గేమ్స్‌కు బీసీసీఐ అందుబాటులో ఉండే ఆటగాళ్ల జాబితాను సిద్ధం చేసింది. 30 మంది క్రికెటర్లతో కూడిన జాబితాను ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్‌కు అందజేసింది. ఈ గేమ్స్‌కు ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శన చేసిన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని ఎంపిక చేసింది. ఇక, టీమ్‌ఇండియా టీ20 జట్టు కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పేర్లను చేర్చలేదు. ఈ ఏడాది సెప్టెంబరు 19 నుంచి అక్టోబరు 4 వరకు జపాన్ వేదికగా ఆసియా క్రీడలు జరగనున్నాయి. అయితే, అదే సమయంలో వెస్టిండీస్‌పై భారత్ స్వదేశంలో సిరీస్ ఖరారు చేసుకుంది. ఇందులో మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు ఉన్నాయి. దీంతో టీ20ల కోసం రెండు వేర్వేరు జట్లను సిద్ధం చేయాలని బీసీసీఐ ముందుగానే నిర్ణయించుకుంది. వెస్టిండీస్ సిరీస్‌తో పాటు, 2028 ఒలింపిక్స్ గేమ్స్, టీ20 వరల్డ్‌కప్ సన్నద్ధత నేపథ్యంలో వర్క్‌లోడ్ దృష్ట్యా సూర్యకుమార్‌ను బీసీసీఐ ఆసియా గేమ్స్‌కు ఎంపిక చేయలేదు. ఇక, శుభ్‌మన్ గిల్ కూడా స్వదేశంలో వన్డేలకు సారథ్య బాధ్యతలు నిర్వహించాల్సి ఉంది. ఇక, జాబితాలో పేసర్ బుమ్రా పేరు ఉన్నప్పటికీ.. తుది జట్టులో అతడిని ఎంపిక చేస్తారా? లేదా? అనేది సందేహమే. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబరు 19 మధ్య భారత్-వెస్టిండీస్ సిరీస్ జరగనుంది. ఆసియా గేమ్స్‌లో ఆడే భారత జట్టు కెప్టెన్ రేసులో శ్రేయస్ అయ్యర్, సంజు శాంసన్, తిలక్ వర్మ పేర్లు వినిపిస్తున్నాయి. స్పిన్నర్లలో కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, హర్ష్ దూబే అందుబాటులో ఉంటారని బీసీసీఐ తెలిపింది. అయితే, తుది జట్టులో వీరిలో ఇద్దరినే ఎంపిక చేసే అవకాశాలున్నాయి.

### 30మంది ఆటగాళ్ల జాబితా ఇదే..

యశస్వి జైస్వాల్, అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, సంజు శాంసన్, శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్, హార్దిక్ పాండ్య, రింకు సింగ్, తిలక్ వర్మ, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, కుల్‌దీప్ యాదవ్, నితీశ్ కుమార్ రెడ్డి, ప్రసిద్ధ్ కృష్ణ, వరుణ్ చక్రవర్తి, అనుకుల్ రాయ్, ఆయుష్ బదోనీ, హర్ష్ దుబె, ధ్రువ్ జురెల్, ఖలీల్ అహ్మద్, రుతురాజ్ గైక్వాడ్, రవి బిష్ణోయ్, షాబాజ్ అహ్మద్, శివమ్ దుబె, విప్రాజ్ నిగమ్, హర్షిత్ రాణా, యశ్ ఠాకూర్, వాషింగ్టన్ సుందర్


## వైభవ్ అద్భుతం.. ప్రపంచంలోనే ఉత్తమ ఆటగాడు..!

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లోవైభవ్ సూర్యవంశీ ఆటకు ఫిదా అయిపోయారంతా. ప్రత్యర్థి ఆటగాళ్లు సైతం ఏమన్న ఆడుతున్నాడా అని ప్రశంసలు కురిపిస్తున్నారు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సైతం మెచ్చుకున్నాడు. 'ఈ సీజన్ వైభవ్‌కు గుర్తుండి పోతుందని అనుకుంటున్నా. ఇప్పటివరకూ అతడిలా ఆడే బ్యాటర్‌ను నేను చూడలేదు. ఈ క్షణం.. ప్రపంచంలోని ఉత్తమ బ్యాటర్లలో వైభవ్ ఒకడు. అతడి ఆట ఎంతో అద్భుతం. హిట్టింగ్ ఒక్కటే కాదు.. అతడిలో భయమే లేదు. అందరూ ఆకాశానికెత్తేస్తున్నా అతడు చాలా ప్రశాంతంగా మైదానంలోకి దిగి మమ్మల్ని ఒత్తిడిలో పడేశాడు. రాబోయే రోజుల్లో వైభవ్ ఆటతో ప్రత్యర్థి జట్లకు ఇబ్బందులు తప్పకపోవచ్చు' అని గిల్ పేర్కొన్నాడు.

## మమ్మల్ని బౌలర్లే గెలిపించాలి: రజత్ పాటిదార్

ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్.. ఆదివారం అహ్మదాబాద్ వేదికగా ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్ మధ్య జరగనుంది. ఈ మ్యాచ్‌లో బెంగళూరు జట్టు విజయం సాధించడం తమ బౌలర్ల చేతుల్లోనే ఉందని కెప్టెన్ రజత్ పాటిదార్ అన్నాడు. 'పోటీలో నెగ్గాలంటే.. చక్కటి బౌలింగ్ ఎటాక్ ఉండాలి. ఈ పిచ్‌పై 200, 220 పరుగులు చేయడం తేలిక. కానీ ఆ స్కోర్‌ను డిఫెండ్ చేసుకోవడం కష్టం. అందుకే బౌలింగ్ దళం సత్తా చాటాలి' అని పాటిదార్ అన్నాడు. అలాగే భువనేశ్వర్ కుమార్ బౌలింగ్‌ను అతడు కొనియాడాడు. 'భువీ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అతడు అనుభవమున్న బౌలర్. తుదిపోరులో బౌలింగ్ చేయడం బౌలర్లకు అంత తేలికైన విషయం కాదు. అతడికి తన ప్రణాళికలు, శక్తిసామర్థ్యాల మీద పూర్తి అవగాహన ఉంది. అదే కీలక పాత్ర పోషించనుంది' అని రజత్ పాటిదార్ అన్నాడు. 'టాప్ బౌలర్లైన భువీ, హేజిల్‌వుడ్‌కు ఇతర బౌలర్ల నుంచీ మద్దతు అవసరం. రసిఖ్ సలామ్ దార్ ఈ విషయంలో జట్టుకు సాయపడ్డాడు.







# టైటిల్ పట్టేదెవరో!

### ఆర్సీబీ-గుజరాత్ అమీతుమీ

### అహ్మదాబాద్ వేదికగా ఫైనల్.. గణాంకాలు బెంగళూరు వైపే

ఐపీఎల్-2026 తుది అంకానికి చేరుకుంది. ఈ సీజన్ విజేత ఎవరో ఆదివారం తేలనుండగా, ఫైనల్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), గుజరాత్ టైటాన్స్ జట్లు తలపడనున్నాయి. వరుసగా రెండోసారి ట్రోఫీని సొంతం చేసుకోవాలని ఆర్సీబీ పట్టుదలగా ఉండగా, క్వాలిఫయర్-1లో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకుని రెండో టైటిల్‌ను ఖాతాలో వేసుకోవాలని గుజరాత్ టైటాన్స్ ఉవ్విళ్లూరుతోంది. (ఈవార్తలు-క్రీడావాణి)

### టైటిల్ నిలబెట్టుకోవాలని ఆర్సీబీ లక్ష్యం

డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఆర్సీబీ ఈ సీజన్‌లో కూడా అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు చేరుకుంది. క్వాలిఫయర్-1లో గుజరాత్‌ను ఓడించి నేరుగా తుదిపోరుకు అర్హత సాధించింది. విరాట్ కోహ్లీ, కెప్టెన్ రజత్ పాటిదార్ అద్భుత ఫామ్‌లో ఉండటం ఆ జట్టుకు ప్రధాన బలం. వెంకటేశ్ అయ్యర్ దూకుడైన బ్యాటింగ్‌తో మెరవగలిగితే ప్రత్యర్థులకు మరింత ప్రమాదం. అటు కృనాల్ పాండ్య బ్యాట్, బంతితో జట్టుకు కీలకంగా మారాడు. అనుభవజ్ఞుడైన భువనేశ్వర్ కుమార్ తన స్వింగ్, యార్కర్లతో ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేస్తున్నాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతూకంగా కనిపిస్తున్న ఆర్సీబీ టైటిల్ రేసులో బలమైన పోటీదారుగా నిలుస్తోంది.

అదాబాద్‌లోని సొంత మైదానం గుజరాత్‌కు అనుకూల అంశమైనప్పటికీ, ప్రస్తుత ఫామ్‌లో ఉన్న బెంగళూరును తక్కువ అంచనా వేయలేమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఐపీఎల్ చరిత్రలో ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్ ఇప్పటివరకు తొమ్మిది సార్లు ముఖాముఖి తలపడ్డాయి. వీటిలో ఆర్సీబీ ఐదు విజయాలు సాధించగా, గుజరాత్ నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచింది. ఈ సీజన్‌లో ఈ రెండు జట్లు మూడు సార్లు తలపడగా, రెండు మ్యాచ్‌ల్లో ఆర్సీబీ విజయం సాధించింది. గణాంకాల పరంగా చూస్తే బెంగళూరుకే స్వల్ప పైచేయి కనిపిస్తోంది. ఈ సీజన్‌లో అత్యంత స్థిరంగా రాణించిన రెండు జట్లు ఫైనల్‌లో తలపడుతుండటంతో అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఒకవైపు వరుసగా రెండో టైటిల్ కోసం ఆర్సీబీ పోరాడుతుండగా, మరోవైపు రెండోసారి చాంపియన్‌గా నిలవాలని గుజరాత్ టైటాన్స్ లక్ష్యంగా పెట్టుకుంది. అహ్మదాబాద్ వేదికగా జరిగే ఈ పోరు ఐపీఎల్-2026కు ఘన ముగింపు ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.

### గిల్-సుదర్శన్‌పై గుజరాత్ ఆశలు

క్వాలిఫయర్-2లో రాజస్థాన్ రాయల్స్‌పై ఏడు వికెట్ల తేడాతో గెలిచిన గుజరాత్ టైటాన్స్ పూర్తి ఆత్మవిశ్వాసంతో ఫైనల్‌లోకి అడుగుపెడుతోంది. ఆ మ్యాచ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 104 పరుగులతో సెంచరీ బాదగా, సాయిసుదర్శన్ 58 పరుగులతో రాణించాడు. ఈ ఇద్దరి ఓపెనింగ్ జోడీ మరోసారి మెరుస్తే గుజరాత్‌కు భారీ స్కోరు ఖాయం. వీరితో పాటు జోస్ బట్లర్ కూడా మంచి ఫామ్‌లో ఉండటం ఆ జట్టుకు అదనపు బలంగా మారింది. అయితే ప్రధాన పేసర్ మహ్మద్ సిరాజ్ భుజం నొప్పితో బాధపడటం ఆ జట్టును ఆందోళనకు గురిచేస్తోంది. అతడు పూర్తిగా కోలుకోకపోతే పేస్ బాధ్యతలు కగిసో రబాడ, ప్రసిద్ధ్ కృష్ణపై మరింత పెరగనున్నాయి.

## రెండో టీ20లో భారత్ చిత్తు

మహిళల పొట్టి ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌లో భారత జట్టుకు ఇంగ్లండ్ షాకిచ్చింది. తొలి టీ20లో విజయంతో జోరుమీదున్న టీమిండియాను రెండో మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు చిత్తు చేసింది. ఫ్రేయా కెంప్(39 నాటౌట్), అమీ జోన్స్(28) రాణించగా భారత్‌కు 169 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించిన ఇంగ్లండ్ పరుగులతో గెలుపొంది సిరీస్ సమం చేసింది. మంధాన(32), యస్తికా భాటియా(33) పోరాడినా మిగతా వాళ్లు చేతులెత్తేయడంతో హర్మన్‌ప్రీత్ సేన మ్యాచ్ చేజార్చుకుంది. ఇంగ్లండ్ గడ్డపై విజయంతో ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌ను ఆరంభించిన భారత జట్టు రెండో మ్యాచ్‌లో తేలిపోయింది. ప్రత్యర్థిని కట్టడి చేయడంలో విఫలమైన టీమిండియా.. 169 పరుగుల లక్ష్యాన్ని అందుకోలేకపోయింది. భారీ ఛేదనలో ఓపెనర్లు షఫాలీ వర్మ(22), స్మృతి మంధాన(32)లు దూకుడుగా ఆడినా ఇంగ్లండ్ బౌలర్లు వికెట్ల వేటతో పరుగులు వేగాన్ని అడ్డుకున్నారు. డేంజరస్ షఫాలీని లారెన్ బెల్ పెవిలియన్ పంపగా.. యస్తికా భాటియా(33), మంధాన పవర్ ప్లేలో స్కోర్ 40 దాటించారు. అనంతరం ఫ్రేయా కెంప్ ఓవర్లో రెండు ఫోర్లు బాదిన మంధాన చివరి బంతికి సిక్సర్ కొట్టబోయి క్యాప్సే చేతికి చిక్కింది. దాంతో రెండో వికెట్ 43 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. మంధాన ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(28) బిగ్ షాట్లతో అలరించింది. ఈ క్రమంలోనే టీ20ల్లో నాలుగు వేల పరుగులు పూర్తి చేసుకుంది. యస్తిక రిటైర్డ్ హర్ట్‌గా డగౌట్ చేరగా.. జెమీమా రోడ్రిగ్స్(1), దీప్తి శర్మ(2)లు విఫలమయ్యారు. అరుంధతి రెడ్డి(4 నాటౌట్), శ్రేయాంక పాటిల్(6)లు సైతం ఇలా వచ్చి అలా వెళ్లడంతో భారత్ 9 వికెట్ల నష్టానికి 142 పరుగులే చేసింది. ఫలితంగా 26 పరుగుల తేడాతో గెలిచి సిరీస్ సమం చేసింది. నిర్ణయాత్మక మూడో టీ20 జూన్ 2న జరగనుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ 21 పరుగులకే తొలి వికెట్ కోల్పోయింది. తొలి అంతర్జాతీయ టీ20 ఆడుతున్న నందిని శర్మ(1-36) ఓవర్లో సోఫీయా డంక్లే(10) వికెట్ కీపర్ రీచా ఘోష్ చేతికి చిక్కింది. ఆ తర్వాత డానీ వ్యాట్(29), అమీ జోన్స్ (28) భారత బౌలర్లను ఉతికేస్తూ స్కోర్ బోర్డును ఉరికించారు. వ్యాట్ ఔటయ్యాక.. అలిసే క్యాప్సే(28), హీథర్ నైట్(18)లు మిడిల్ ఓవర్లలో చెలరేగగా.. డెత్ ఓవర్లలో ఫ్రేయా కెంప్(39 నాటౌట్), డానియెల్లే గిబ్సన్ (11 నాటౌట్) దంచేశారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 42 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. దాంతో, ఇంగ్లండ్ నిర్ణీత ఓవర్లలో 168 పరుగులు చేయగలిగింది.





## ఫైనల్లో సాత్విక్ - చిరాగ్

ప్రతిష్ఠాత్మక సింగపూర్ ఓపెన్‌లో భారత ద్వయం సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి జైత్రయాత్ర కొనసాగుతోంది. పురుషుల డబుల్స్‌లో తిరుగులేని ఆటతో ప్రత్యర్థులకు చెక్ పెడుతున్న ఈ జోడీ దర్జాగా ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన సెమీ ఫైనల్లో వరల్డ్ నంబర్ 1 జోడీని మట్టికరిపించిన సాత్విక్ చిరాగ్ జంట టైటిల్ పోరుకు అర్హత సాధించింది. తద్వారా భారత్‌కు పతకం ఖరారు చేసింది. సింగపూర్ ఓపెన్ సూపర్ 750లో సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి ద్వయం పంజా విసిరింది. పీవీ సింధు, లక్ష్యసేన్ తేలిపోయిన చోట దేశానికి పతకం ఖాయం చేస్తూ ఫైనల్ బెర్తు పట్టేసింది. ప్రపంచ నంబర్ 1 కిమ్ వాన్ హె - సియో సెయంగ్ జీ(దక్షిణ కొరియా) జంటను చిత్తగా ఓడించిన ఈ ద్వయం ఫైనల్లో అడుగు పెట్టింది. శనివారం హోరాహోరీగా జరిగిన సెమీఫైనల్లో భారత జోడీ టాప్ గేర్‌లో ఆడింది. వరసగా రెండు సెట్లలో కొరియా జంటకు ముచ్చెమటలు పట్టించిన భారత ద్వయం 21-19, 21-18తో జయభేరి మోగించింది. కేవలం 52 నిమిషాల్లోనే ప్రత్యర్థిని కంగుతినిపించి కిమ్ - సియోపై తొలి విజయం నమోదు చేసింది. ఫజర్ అల్ఫియాన్ - ముహమ్మద్ షోహిబుల్ ఫిక్రీ(ఇండోనేషియా) లేదా లియాంగ్ వీ కెంగ్ - వాంగ్ ఛాంగ్ జంటలో ఒకరిని ఆదివారం జరుగనున్న టైటిల్ పోరులో సాత్విక్ - చిరాగ్ ద్వయం ఢీ కొట్టనుంది.

## ఏషియన్ గేమ్స్ నుంచి వినేశ్ ఔట్

2026 ఆసియా క్రీడల్లో పాల్గొనాలన్న రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఆశలు ఆవిరయ్యాయి. శనివారం ఏషియన్ గేమ్స్ కోసం జరుగుతోన్న సెలెక్షన్ ట్రయల్స్‌లో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో ఆమె ఓడిపోయారు. 53 కేజీల విభాగంలో మీనాక్షి గోయత్ చేతిలో 4-6 తేడాతో పరాజయం చవిచూశారు. హోరాహోరీగా సాగిన పోరులో వినేశ్, మీనాక్షి చాలాసేపు పోటీపడ్డారు. చివరికి విజయం మాత్రం మీనాక్షికి దక్కడంతో ఆమె ఫైనల్‌కు చేరుకున్నారు.

వివాహేతర సంబంధాలు నేరం కాదు. వివాహేతర సంబంధం పెట్టుకుంటే జైలుకు పంపడానికి వీల్లేదు.

– సుప్రీం కోర్టు

వివాహ బంధంలో ఉండగా దంపతులు కలిసి జీవిస్తున్న సమయంలో భార్యకు వేరే వ్యక్తితో సంబంధం ఉన్నా, ఆ సమయంలో పుట్టిన పిల్లవాడికి భర్తనే తండ్రిగా గుర్తించాలి.

– సుప్రీం కోర్టు


ఒక వివాహిత తన మాజీ ప్రియుడిని ఒక్కసారి కలిసిందనే కారణంతో దాన్ని 'వ్యభిచారం'గా పరిగణించలేం. ఒక్కసారి కలిస్తే వివాహేతర సంబంధం కాదు.

–పంజాబ్, హర్యానా హైకోర్టు

# కోర్టులు దిద్దిన కాపురాలు!

సంస్కృతి నుంచే రాజ్యాంగం వచ్చింది..
సంప్రదాయాలే చట్టాలుగా మారాయి..
సమాజ పద్ధతులే మార్గదర్శకాలయ్యాయి..
నైతిక విలువలే నియమ నిబంధనలయ్యాయి..
ఆ విలువల్లోంచి పుట్టిందే హిందూ వివాహ చట్టం.
'సప్తపది'కి చోటు అలా దక్కిందే.
మరి సప్తపదిని కోర్టులే కాలరాస్తే?
వివాహ చట్టాన్ని న్యాయమూర్తులే ఉల్లంఘిస్తే?

వ్యక్తిగత స్వేచ్ఛ.. ప్రజాస్వామ్య హక్కు
వ్యక్తిగత గోప్యత.. ప్రజాస్వామ్య హక్కు
వ్యక్తి ఎంపిక.. ప్రజాస్వామ్య హక్కు
కానీ,
ఆ స్వేచ్ఛ ఒక కుటుంబాన్ని చిదిమేస్తే?
ఆ గోప్యత మరో జీవితాన్ని బలిచేస్తే?
ఆ ఎంపిక పిల్లల భవిష్యత్తును దెబ్బతీస్తే?
కోర్టులు వీటికి ఎందుకు జవాబివ్వవు?



శ్రావణ వాణి

వివాహేతర సంబంధాలు తప్పు కాదనేది కోర్టులు రాస్తున్న తీర్పులు. అదే సమయంలో సాయుధ దళాల్లో మాత్రం వివాహేతర సంబంధాలు క్రమశిక్షణారాహిత్యం అని అంటారు. ఇదేం ద్వంద్వ విధానం? సాయుధ బలగాలకే విలువలు ఉంటాయా? సాధారణ ప్రజలకు విలువలు ఉండవా?

హిందూ వివాహ చట్టంలో 'సప్తపది' అనేది హిందూ వివాహానికి సంబంధించిన అత్యంత ముఖ్యమైన సంప్రదాయాల్లో ఒకటి. సప్త అంటే ఏడు, పది అంటే అడుగులు. వివాహ సమయంలో వధూవరులు అగ్నిని సాక్షిగా చేసుకుని కలిసి ఏడు అడుగులు వేయడాన్ని సప్తపది అంటారు. దీనిని అధర్వణ వేదం, గృహ్య సూత్రాల ఆధారంగా జరుపుకుంటారు. వధూవరులు అగ్ని సాక్షిగా జీవితాంతం ఒకరికి ఒకరు తోడుగా ఉంటామని ఏడు అడుగులు వేస్తూ ప్రమాణాలు చేస్తారు. ఈ చట్టం ప్రాచీన వివాహ ధర్మాన్ని ఆధునిక సమాజానికి అనుగుణంగా మార్చి ఒక లౌకిక చట్టంగా భారత ప్రభుత్వం రూపొందించింది. చట్టంలోని సెక్షన్ 7 ప్రకారం.. హిందూ వివాహం సంబంధిత పక్షాల సంప్రదాయాలు, ఆచారాల ప్రకారం జరగాలి. మరి సప్తపది సూచించేది ఏంటి? అంటే.. 'ఆహారం, జీవనాధారం కోసం కలిసి కృషి చేస్తాం. శారీరక, మానసిక బలాన్ని పెంపొందించుకుంటాం. సంపద, శ్రేయస్సు కోసం కలిసి పనిచేస్తాం. సంతోషకరమైన కుటుంబ జీవితం గడుపుతాం. సంతానం, వారి సంక్షేమం కోసం కృషి చేస్తాం. అన్ని ఋతువుల్లో, పరిస్థితుల్లో పరస్పరం తోడుంటాం. జీవితాంతం స్నేహితులుగా, సహచరులుగా విశ్వాసంతో ఉంటాం' అని, చట్టానికి లోబడి ఉంటామని ప్రతిజ్ఞ చేసినట్లు. కానీ, ఆ వివాహ బంధం ముక్కలై.. భార్యాభర్తలు వేరేవాళ్లతో వివాహేతర సంబంధం పెట్టుకుంటే చట్టాన్ని ఉల్లంఘించినట్లే కదా? మరి వివాహేతర సంబంధం తప్పు కాదని కోర్టులు ఎలా అంటాయి?

భారతీయ సమాజం అనేది కేవలం చట్టాల మీద నిలిచిన వ్యవస్థ కాదు. అది వేల ఏళ్ల సంస్కృతి, కుటుంబ బంధాలు, బాధ్యతలు, ఆచారాలు, విలువలు, త్యాగాలు, పరస్పర విశ్వాసాల మీద నిర్మితమైన నాగరికత. ఈ దేశంలో వివాహం అనేది ఇద్దరు వ్యక్తుల మధ్య ఒప్పందం మాత్రమే కాదు; రెండు కుటుంబాల మధ్య బంధం. కేవలం శారీరక సహజీవనం కాదు; ధర్మం, బాధ్యత, నిబద్ధత, పరస్పర గౌరవం అనే నాలుగు స్తంభాల మీద నిలిచే వ్యవస్థ. అయితే గత కొన్నేళ్లుగా భారత న్యాయవ్యవస్థ నుంచి వస్తున్న కొన్ని తీర్పులు సమాజంలో తీవ్రమైన చర్చకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా వివాహేతర సంబంధాలు, లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లు, వ్యక్తిగత స్వేచ్ఛ పేరుతో ఇచ్చిన కొన్ని తీర్పులు కుటుంబ వ్యవస్థను బలహీనపరుస్తున్నాయా? అంటే అవుననే సమాధానం వస్తోంది.

అనేక పాశ్చాత్య దేశాలలో వివాహాన్ని ఒక సివిల్ కాంట్రాక్ట్‌గా చూస్తారు. కానీ భారతీయ దృష్టిలో అది 'సంస్కారం'. హిందూ వివాహ చట్టం కూడా వివాహాన్ని పవిత్ర బంధంగా గుర్తిస్తుంది. 'సప్తపది' కేవలం ఏడు అడుగులు కాదు; జీవితాంతం పరస్పరం నిలబడతామనే ప్రమాణం. అలాంటి వ్యవస్థలో భార్యాభర్తల మధ్య విశ్వాసం అత్యంత కీలకం. ఆ విశ్వాసాన్ని దెబ్బతీసేది వివాహేతర సంబంధం. అందుకే శతాబ్దాలుగా సమాజం దానిని తప్పుగా పరిగణించింది. అయితే ప్రశ్న ఏమిటంటే – ఒక వ్యవహారం నైతికంగా తప్పు అయితే, అది చట్టపరంగా కూడా తప్పేనా? ఇక్కడే కోర్టులు, సమాజం మధ్య ఘర్షణ మొదలవుతోంది.

2018లో భారత సుప్రీంకోర్టు ఇచ్చిన అత్యంత చర్చనీయమైన తీర్పులలో ఒకటి జోసెఫ్ షైన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా. ఈ తీర్పుతో భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 497ను కొట్టివేసింది. అప్పటి వరకు వివాహేతర సంబంధం ఒక నేరంగా పరిగణించబడేది. సుప్రీంకోర్టు మాత్రం అది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. మహిళను భర్త ఆస్తిలా చూసే వలస పాలకుల కాలం నాటి భావజాలం ఈ చట్టంలో ఉందని వ్యాఖ్యానించింది. వివాహేతర సంబంధం నేరం కాదని, అయితే అది విడాకులకు కారణం కావచ్చని స్పష్టం చేసింది. చట్టపరంగా చూస్తే ఈ తీర్పు వ్యక్తిగత స్వేచ్ఛ, సమానత్వం, గోప్యత వంటి రాజ్యాంగ విలువల ఆధారంగా వచ్చింది. కానీ ఇక్కడ ఒక ప్రశ్న. 'నేరం కాకపోతే సమాజానికి పంపే సందేశం ఏమిటి?' న్యాయస్థానం ఉద్దేశం వ్యక్తిగత స్వేచ్ఛను కాపాడటమే కావచ్చు. కానీ సాధారణ ప్రజలలో చాలామందికి ఇది వివాహేతర సంబంధాలకు చట్టబద్ధత ఇచ్చినట్టుగా కనిపించింది. ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. సుప్రీంకోర్టు ఎప్పుడూ 'వివాహేతర సంబంధాలు మంచివి' అని చెప్పలేదు. 'వివాహేతర సంబంధం నేరం కాదు' అని మాత్రమే చెప్పింది. కానీ సమాజం చాలా సార్లు ఈ రెండింటినీ కలిపి చూస్తుంది. చట్టం అనేది కనీస నైతిక ప్రమాణాన్ని అమలు చేస్తుంది. కానీ సమాజం దాని కంటే ఉన్నత ప్రమాణాలను ఆశిస్తుంది. 'దొంగతనం నేరం కాబట్టి తప్పు కాదు; అది తప్పు కాబట్టి నేరం. అదే విధంగా వివాహేతర సంబంధం కుటుంబాన్ని విచ్ఛిన్నం చేస్తే, అది నేరం కాకపోయినా సమాజానికి హానికరం కాదా? ఈ ప్రశ్నకు సరైన సమాధానం లేదు.

గత రెండు దశాబ్దాల్లో భారత న్యాయవ్యవస్థ లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లను కూడా గుర్తించింది. పరస్పర అంగీకారంతో ఇద్దరు పెద్దలు కలిసి జీవించడం నేరం కాదని పలుమార్లు కోర్టులు పేర్కొన్నాయి. తాజాగా దీర్ఘకాలం కొనసాగిన లివ్-ఇన్ సంబంధాల్లో ఇద్దరూ తెలిసే తమ నిర్ణయాన్ని తీసుకున్నారని భావిస్తున్నట్లు సుప్రీంకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇక్కడ కూడా విమర్శకుల అభ్యంతరం అదే. 'వివాహ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన సమయంలో దానికి ప్రత్యామ్నాయంగా లివ్-ఇన్ సంబంధాలను సాధారణీకరించడం సరైందేనా?' ఇది కేవలం న్యాయ ప్రశ్న కాదు; సామాజిక ప్రశ్న.

నా జీవితం – నా ఇష్టం.. ఈ రోజుల్లో బలంగా వినిస్తున్న వాదన ఇది. అవును, రాజ్యాంగం వ్యక్తిగత స్వేచ్ఛను కల్పించింది. కానీ కుటుంబ వ్యవస్థ కూడా సమాజ ప్రయోజనాల కోసమే కదా? ఒక వ్యక్తి స్వేచ్ఛ కారణంగా భార్య, భర్త, పిల్లలు, తల్లిదండ్రులు మానసికంగా కుంగిపోతే ఆ బాధను ఎవరు కొలుస్తారు? కోర్టు తీర్పు చట్టాన్ని మాత్రమే చూస్తుంది. కానీ సమాజం పరిణామాలను చూస్తుంది. అందుకే వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక బాధ్యత మధ్య సమతుల్యత అవసరం. సాధారణంగా చర్చ మొత్తం ఇద్దరు పెద్దల నిర్ణయం చుట్టూ తిరుగుతుంది. కానీ పిల్లల సంగతి? ఒక కుటుంబం విచ్ఛిన్నం అయినప్పుడు అత్యధికంగా నష్టపోయేది పిల్లలే. వారిలో ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. కుటుంబ విలువలపై నమ్మకం తగ్గుతుంది. మానసిక ఒత్తిడి పెరుగుతుంది. ఈ ప్రభావాలను ఏ చట్టం పూర్తిగా పరిష్కరించలేదు.

ఇక్కడ మరో కోణం కూడా ఉంది. కోర్టుల పని సంస్కృతిని కాపాడడమా? లేక రాజ్యాంగాన్ని కాపాడడమా? రాజ్యాంగం ప్రకారం కోర్టులు వ్యక్తుల హక్కులను రక్షించాలి. ఒక చట్టం రాజ్యాంగ విరుద్ధమైతే దాన్ని కొట్టివేయాలి. అదే పని జోసెఫ్ షైన్ కేసులో జరిగింది. అంటే కోర్టు కుటుంబ వ్యవస్థకు వ్యతిరేకమని చెప్పడం సరైన విశ్లేషణ కాకపోవచ్చు. అయితే ప్రజలలో ఏర్పడుతున్న భావనను కూడా విస్మరించలేం. ఎందుకంటే న్యాయ తీర్పులు కేవలం కోర్టు గదుల్లో ఉండవు; సమాజంలో ప్రభావం చూపుతాయి. కోర్టులు తీర్పులు ఇచ్చేటప్పుడు రాజ్యాంగాన్ని మాత్రమే కాదు, వాటి సామాజిక ప్రభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ప్రత్యేకంగా కుటుంబ వ్యవస్థకు సంబంధించిన అంశాల్లో భాష, వ్యాఖ్యలు, పరిశీలనలు మరింత బాధ్యతాయుతంగా ఉండాలి. ఎందుకంటే ప్రజలు చాలా సార్లు తీర్పు సారాంశాన్ని కాకుండా శీర్షికలను మాత్రమే చదువుతారు.

'అడల్టరీ నేరం కాదు..' అనే ఒక వాక్యం మాత్రమే ప్రజలకు చేరుతుంది. దాని వెనుక ఉన్న రాజ్యాంగ విశ్లేషణ చాలా మందికి చేరదు. అప్పుడు అపార్థాలు పెరుగుతాయి. అయితే, అన్ని తప్పులు కోర్టులవే అని చెప్పడం కూడా సరైంది కాదు. వివాహేతర సంబంధాలు పెరగడానికి కారణం కేవలం తీర్పులు కావు. సోషల్ మీడియా ప్రభావం, వినియోగ సంస్కృతి, కుటుంబ బంధాల బలహీనత, బాధ్యతల పట్ల నిర్లక్ష్యం, వ్యక్తికేంద్ర జీవనశైలి.. ఇవన్నీ కారణాలు. ఒక తీర్పు వల్ల లక్షలాది మంది ఒక్కసారిగా తమ విలువలు మార్చుకోరు. విలువలు బలహీన పడినప్పుడు మాత్రమే తీర్పుల ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. భారతీయత అంటే కేవలం సంప్రదాయాలను పొగడటం కాదు. బాధ్యతలను నిలబెట్టడం కూడా. వ్యక్తిగత స్వేచ్ఛకు విలువ ఇవ్వడం ఎంత ముఖ్యమో, కుటుంబ బంధాలను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యం. న్యాయస్థానాలు రాజ్యాంగాన్ని కాపాడాలి. సమాజం విలువలను కాపాడాలి. ఈ రెండింటి మధ్య సమతుల్యత కోల్పోతే, చివరికి గెలిచేది ఎవరూ కాదు – ఓడిపోయేది కుటుంబ వ్యవస్థే.



శ్రావణ్ కుమార్ బొమ్మకంటి
ఎడిటర్, MTech, LLB
9581291919

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.